ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



అటవీశాఖ ఆర్థిక దోపిడీ



శ్రీశైల పాదయాత్రికుల వద్ద రుసుము వసూలు చేస్తున్న అటవీ సిబ్బంది

- అడవుల సంరక్షణ మరిచి ఆదాయం కోసం ప్రయత్నం
- భక్తుల మనోభావాలతో చెలగాటం
- పర్యావరణ రుసుం పేరిట వసూళ్ల పర్వం
- శ్రీశైల పాదయాత్రికులను వదలని వైనం
- మండిపడుతున్న హిందూ ధార్మిక సంఘాలు

ఆత్మకూరు, ఫిబ్రవరి 25:

ఆదాయమే పరమావధిగా అటవీ శాఖ బరి తెగిస్తోంది. అడవుల సంరక్షణను మరిచి ఆదాయ మార్గాలపై అన్వేషణ సాగిస్తోంది. పర్యావరణ రుసుము పేరిట ఎవర్నీ వదలకుండా వసూళ్ల పర్వానికి శ్రీకారం చుట్టింది. శ్రీశైలానికి కాలినడకన తరలి వెళ్లే భక్తులను సైతం వదలడం లేదు. భక్తుల మనోభావాలను పరిగణలోకి తీసుకోకుండా చివరికి వారి నుంచి కూడా డబ్బు వసూళ్లకు పాల్పడటంపై హిందూ ధార్మిక సంఘాలు మండిపడుతున్నాయి. ఈ నేపథ్యంలోనే ద్వాదశ జ్యోతిర్లింగాలో ఒకటైన శ్రీశైల మహాక్షేత్రంలో మార్చి 1 నుంచి ప్రారంభం కానున్న మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని శ్రీశైలానికి భక్తులు కాలినడకన వెళ్తుంటారు. అయితే ఈ ఏడాది కొత్తగా శ్రీశైలానికి వెళ్లే పాదయాత్రికులకు పర్యావరణ రుసుము చెల్లించాలని అటవీశాఖ నిబంధనలు తీసుకొచ్చింది. నిజానికి వందల ఏళ్ల నుంచి శ్రీశైలానికి కాలినడకన వెళ్లడం పరిపాటిగా వస్తోంది. అయితే ఎన్నడూ లేనివిధంగా పర్యావరణ రుసుము పేరిట పాదయాత్రికుల నుంచి డబ్బు వసూళ్లు చేయడం విమర్శలకు తావిస్తోంది. వాస్తవానికి కొంత కాలంగా అడవుల, వన్యప్రాణుల సంరక్షణ ప్రశ్నార్థకంగా మారింది. అటవీ సమీప ప్రాంతాల్లో తరచూ వన్యప్రాణుల వేట కొనసాగుతోంది. అయితే అడవుల, వన్యప్రాణుల సంరక్షణ గాలికి వదిలేసి ఆదాయ మార్గాలపై దృష్టి సారించడంపై విమర్శలు వస్తున్నాయి. అటవీ శాఖనా..? లేక ఆదాయ శాఖనా..? అంటున్నవాళ్లు ఉన్నారు.

పర్యావరణ రుసుము పేరిట వసూళ్ల పర్వం

అటవీ శాఖ గత కొన్నేళ్లుగా పర్యావరణ రుసుము పేరిట వివిధ రూపాల్లో వసూళ్ల పర్వానికి శ్రీకారం చుట్టింది. 2016లో ఆత్మకూరు నుంచి శ్రీశైలానికి వెళ్లే రహదారిలో బైర్లూటి, కొత్త ప్రోలు, దోర్నాల, శిఖరం ప్రదేశాల వద్ద అటవీ చెక్‌పోస్టులను ఏర్పాటు చేసి పర్యావరణ రుసుము వసూళ్లను ప్రారంభించారు. తొలుత భారీ వాహనాలకు రూ.50, లైట్ వెహికల్స్‌కు రూ.20 చొప్పున వసూళ్లు చేపట్టగా ప్రస్తుతం భారీ వాహనాలకు రూ.100, లైట్ వెహికల్స్‌కు రూ.50 చొప్పున దండుకుంటున్నారు. ఈ లెక్కన ఒక్కో చెక్‌పోస్టు వద్ద ప్రతి రోజూ సుమారు రూ.30 వేల నుంచి రూ.లక్ష ఆదాయం సమకూరుతోంది. ఇవేకాకుండా శ్రీశైలంలో ఇష్టకామేశ్వరి అమ్మవారి దర్శనానికి అటవీ శాఖే స్వయంగా ఒక్కొక్కరి వద్ద నుంచి రూ.1000 వసూలు చేస్తోంది. ఏడాదిన్నర క్రితం మరికొన్ని నిబంధనలు ప్రవేశపెట్టి జరిమానాల వసూళ్లు చేస్తున్నారు. ప్రత్యేకించి నల్లమలలోని కర్నూలు-గుంటూరు జాతీయ రహదారి, దోర్నాల - శ్రీశైలం రహదారిపై అడవిలో చెత్త, ప్లాస్టిక్ వేసినచో రూ.1000, అడవిలో ధూమపానం, మద్యం సేవించినచో రూ.1000, రహదారి ప్రయాణికులకు కోతులకు ఆహారం వేస్తే రూ.1000, అడవిలో అకారణంగా వాహనాలు నిలిపిస్తే రూ.500, అటవీ మార్గంలో 30 కిలో మీటర్లకు మించి వేగంగా ప్రయాణిస్తే రూ.500 జరిమానా వసూళ్లు చేస్తున్నారు. అలాగే శ్రీశైలంలోని సాక్షి గణపతి, హటకేశ్వరం ప్రాంతాల్లో పార్కింగ్ చార్జి పేరిట ఒక్కో వాహనానికి రూ.50 వసూళ్లు చేస్తున్నారు. ఇటీవలే ఆత్మకూరు సమీపంలోని రుద్రకోటేశ్వర స్వామి క్షేత్రానికి ఒక్కో వాహనం రూ.300 పర్యావరణ రుసుము చెల్లిస్తేనే ఆలయానికి వెళ్లేందుకు అనుమతులు ఇస్తున్నారు. ఇవి కాదని తాజాగా శ్రీశైలానికి కాలినడకన వెళ్లే పాదయాత్రికుల నుంచి కూడా ఒక్కొక్కరి వద్ద నుంచి రూ.10 వసూళ్లకు పాల్పడటం ఆశాఖ బరితెగింపుపై మల్లన్న భక్తులు మండిపడుతున్నారు.

శ్రీశైల పాదయాత్రికుల నుంచి డబ్బు వసూళ్లు

శ్రీశైలంలో జరిగే ఉత్సవాలను పురస్కరించుకుని ప్రతిఏటా సుమారు 8నుంచి 12 లక్షల మందికి పైగా భక్తులు కాలినడకన తరలి వెళ్తుంటారు. ఇందులో ప్రధానంగా మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని ఏపీ, తెలంగాణ రాష్ట్రాల నుంచి సుమారు 4 నుంచి6 లక్షల మంది భక్తులు శ్రీశైలానికి పాదయాత్రగా వెళ్తారు. అలాగే ఉగాది ఉత్సవాలను పురస్కరించుకుని కర్ణాటక, మహారాష్ట్ర రాష్ట్రాల నుంచి 5 లక్షల మందికిపైగా మల్లన్న భక్తులు భక్తిశ్రద్ధలతో వందల కి.మీ.ల పాదయాత్రగా శ్రీశైలానికి తరలి వెళ్తుంటారు. ఇటీవల కాలంలో ఈ సంఖ్య మరింత పెరిగిపోతుంది. అయితే ఈసారి వినూత్నంగా కాలినడకన వెళ్లే భక్తుల నుంచి కూడా పర్యావరణ రుసుము పేరిట డబ్బు వసూళ్లు చేయాలని భావించడం విమర్శలకు తావిస్తోంది. భక్తుల మనోభావాలను ఏమాత్రం పరిగణలోకి తీసుకోకుండా ఒక్కొక్కరి నుంచి రూ.10 వసూళ్లు చేస్తే ప్రతిఏటా కోటికి పైగా ఆదాయాన్ని ఆర్జించవచ్చునన్న దురాలోచనకు సిద్ధమైనట్లు తెలిసింది. రూ.10 కదా అని తేలిగ్గా భావిస్తే భవిష్యత్‌లో ఈ రుసుము ఎంతవరకైనా పెంచే అవకాశం లేకపోలేదు. వాస్తవానికి కాలినడకన తరలి వెళ్లే పాదయాత్రికుల ద్వారా శ్రీశైల దేవస్థానానికి, ప్రభుత్వానికి ప్రత్యక్ష, పరోక్షంగా అనేక విధాలుగా ఆదాయం సమకూరుతోంది. ఇవికాదని పర్యావరణ రుసుము వసూళ్లు చేయడం ఏమిటని భక్తులు ప్రశ్నిస్తున్నారు. అంతేగాకుండా ప్రతిఏటా అటవీశాఖకు శ్రీశైల దేవస్థానం తరపున కొంతమేర నిధులు కూడా ఇస్తున్నట్లు తెలిసింది. ఆ విధంగా నిధులు తీసుకుంటూనే భక్తుల నుంచి వసూళ్లకు పాల్పడటం ఏంటన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.



శ్రీశైలానికి కాలినడకన తరలివెళ్తున్న భక్తులు



ఆత్మకూరు అటవీశాఖ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న శివస్వాములు

ప్రభుత్వానికి తెలిసే ఇదంతా జరుగుతోందా..?



డబ్బు వసూలు చేసేందుకు సిద్ధం చేసిన రసీదులు

పర్యావరణ రుసుము పేరిట అటవీశాఖ ప్రజలపై వేస్తున్న ఆర్థిక భారం ప్రభుత్వానికి తెలిసే జరుగుతుందా..? లేక అటవీ శాఖలోని కొందరు అధికారులు నిర్ణయాలతో సాగుతుందా..? అన్నది ప్రశ్నార్థకంగా మారింది. అసలు వసూళ్లు చేసిన సొమ్మును సక్రమంగా వినియోగిస్తున్నారన్న అన్నది కూడా సందేహంగా మారింది. నిజానికి అటవీ శాఖలో నిధుల వినియోగ వ్యవహారం చాలా వరకు బాహ్య ప్రపంచానికి తెలియదు. ఇందులో భాగంగానే అటవీశాఖలో విచ్చలవిడిగా నిధులు దుర్వినియోగం జరుగుతున్నట్లు విమర్శలు ఉన్నాయి. జనాల నుంచి అనేక రూపాల్లో డబ్బులు వసూళ్లు చేసి అధికారులు దర్జాగా అక్రమాలకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. అటవీశాఖ చేస్తున్న వ్యవహారంపై ప్రజాప్రతినిధులు సైతం చూసీచూడనట్లు ఉండటం వల్లే వసూళ్లు రోజురోజుకు మితిమీరుతున్నట్లు తెలిసింది.

శ్రీశైల దేవస్థానం ఏం చేస్తోంది

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోనే శ్రీశైలం రెండో అతిపెద్ద పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతోంది. ఇటీవల కాలంలో శ్రీశైలానికి భక్తుల రద్దీ భారీగా పెరిగింది. అదే క్రమంలో క్షేత్రానికి రాబడి విపరీతంగా పెరిగింది. ప్రత్యేకించి శ్రీశైలానికి ఉత్సవాల సమయంలో తరలి వచ్చే పాదయాత్రికులతో కోట్ల రూపాయల్లో ప్రత్యక్ష, పరోక్షంగా ఆదాయం సమకూరుతోంది. భక్తులను అటవీశాఖ ఆంక్షల పేరిట అనేక విధాలుగా ఇబ్బందులు పెడుతుంటే శ్రీశైల దేవస్థానం ఏం చేస్తోందని పలువురు ప్రశ్నిస్తున్నారు. దారి పొడవునా జరుగుతున్న వసూళ్ల పర్వాన్ని ప్రభుత్వ పెద్దల దృష్టికి ఎందుకు తీసుకెళ్లలేకపోతున్నారని విమర్శలు ఉన్నాయి. అటవీ శాఖ ఇంతా చేస్తున్నా జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఎందుకు నోరు మెదపడం లేదని భక్తులు ప్రశ్నిస్తున్నారు.

మండిపడుతున్న హిందూ ధార్మిక సంఘాలు



వివిధ రూపాల్లో అటవీశాఖ విధిస్తున్న జరిమానాల వివరాలు

అటవీ శాఖ వసూళ్ల పర్వంపై హిందూ ధార్మిక సంఘాలు మండిపడుతున్నాయి. ఇప్పటికే రుద్ర కోటేశ్వర క్షేత్రానికి ఆంక్షలు విధించడంపై శివ స్వాములు ఆత్మకూరు-నంద్యాల రహదారిపై రాస్తారోకో చేసి ఆందోళన చేపట్టారు. దీంతో దిగివచ్చిన అటవీశాఖ అధికారులు బైకుల్లో వెళ్లేందుకు అనుమతిచ్చారు. అయితే తాజాగా శ్రీశైలానికి పాదయాత్రగా వెళ్లే భక్తుల నుంచి కూడా డబ్బు వసూళ్లు చేయడంపై వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. శతాబ్దాలుగా శ్రీశైలానికి భక్తులు కాలినడకన వెళ్తున్నారని, అయితే కొత్తగా ఈ నిబంధనలు ఏంటని నిలదీస్తున్నారు.

పర్యావరణ రుసుము వసూళ్లను ఎత్తివేయాలి



పర్యావరణ రుసుము పేరిట ప్రజలపై వేస్తున్న భారాలను అటవీ శాఖ ఎత్తివేయాలి. ఇప్పటికే అనేక రూపాల్లో రుసుము వసూళ్లు చేస్తూ ఇవి చాలవని చివరికి శ్రీశైలానికి కాలినడకన వెళ్లే భక్తుల నుంచి డబ్బు వసూళ్లు చేయాలని నిర్ణయించడం విడ్డూరంగా ఉంది. వందల ఏళ్ల నుంచి శ్రీశైలానికి భక్తులు కాలినడకన వెళ్తున్నారు. కొత్తగా అటవీశాఖ వసూళ్లు చేయడం భక్తుల మనోభావాలను కించపరిచినట్లే. అడవుల రక్షణ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలే తప్ప భక్తుల నుంచి వసూళ్లు చేయడం అన్యాయం. ఇప్పటికైనా అటవీ అధికారులు పర్యావరణ రుసుము వసూళ్లను పూర్తిగా ఎత్తివేయాలి. లేనిపక్షంలో హిందువుల ఆగ్రహానికి గురికాక తప్పదు.

- గరుడాద్రి సుదర్శన్, విశ్వహిందూ పరిషత్ అధ్యక్షుడు, ఆత్మకూరు ప్రఖండ

భక్తుల మనోభావాలను కించపరిచినట్లే



ఎంతో కఠోర భక్తిశ్రద్ధలతో శ్రీశైలానికి భక్తులు తరలివెళ్తుంటారు. వారికి దారి పొడవునా దాతలు సేవలందిస్తుంటారు. అయితే అటవీ శాఖ భక్తులకు సేవలందించాల్సిందిపోయి డబ్బు వసూళ్లకు పాల్పడం బాధాకరం. ఇప్పటికే శ్రీశైలానికి పాదయాత్రగా వెళ్లే భక్తులు, దాతలు అందించే సేవలకు అటవీశాఖ అనేక ఆంక్షలను విధిస్తోంది. వాటన్నింటికి అందరం సహకరిస్తున్నాం. ఇవి కాదని మళ్లీ పర్యావరణ రుసుముల పేరిట వసూళ్లు చేయడమంటే భక్తుల మనోభావాలను కించపరిచినట్లే. ఇష్టకామేశ్వరీ అమ్మవారి ఆలయానికి వెళ్లాలంటే ప్రతిభక్తుడు రూ.1000 చెల్లించాల్సి వస్తోంది. చూస్తూపోతే భవిష్యత్‌లో శ్రీశైల పాదయాత్రకు వెళ్లేందుకు కూడా అటవీ శాఖ వేలల్లో వసూళ్లు చేసినా ఆశ్చర్యపోనక్కర్లేదు. **- మారుతీ, శివదీక్షాపరుడు, ఆత్మకూరు**



కోట్లను కలిసిన వై నాగేశ్వరరావు యాదవ్, వలసల రామకృష్ణ తదితరులు

డోన్‌లో టీడీపీ జెండా ఎగురవేద్దాం

- కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి

డోన్, ఫిబ్రవరి 25: డోన్ నియోజకవర్గంలో టీడీపీ జెండాను ఎగురవేసి చంద్రబాబు నమ్మకాన్ని నిలబెట్టుకుందామని కేంద్ర మాజీ మంత్రి, డోన్ అసెంబ్లీ టీడీపీ అభ్యర్థి కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి అన్నారు. ఆదివారం కర్నూలులోని కోట్ల నివాసంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శులు వై.నాగేశ్వరరావు యాదవ్, వలసల రామకృష్ణలతోపాటు బి.రామదుర్గం, వలసల గ్రామాలకు చెందిన టీడీపీ నాయకులు, కార్యకర్తలు కోట్లను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డి మాట్లాడుతూ సీఎం జగన్ పాలనలో అన్ని వర్గాల ప్రజలకు అన్యాయం జరిగిందన్నారు. చంద్రబాబు హయాంలో సాగు నీటి ప్రాజెక్టులను మంజూరు చేస్తే.. వాటికి నిధులివ్వకుండా వైసీపీ ప్రభుత్వం రైతులకు అన్యాయం చేసిందన్నారు. డోన్ నియోజకవర్గంలో వరుస కరువు పరిస్థితులతో రైతులు నష్టపోయినా వైసీపీ ప్రభుత్వం ఆదుకునే చర్యలు తీసుకోకపోవడం అన్యాయమన్నారు. రైతుల బాధలు మంత్రి బుగ్గనకు కనిపించడం లేదా అని ప్రశ్నించారు. నియోజకవర్గంలో ప్రజలకు ఎన్నో అవసరాలు ఉన్నాయని, వాటికి ప్రాధాన్యత ఇచ్చి ముందుకు సాగుతామని తెలిపారు. అభివృద్ధికి పెద్దపీట వేస్తామని హామీ ఇచ్చారు. అందరం కలిసికట్టుగా టీడీపీ జెండా కింద పని చేసి వైసీపీని ఓడిద్దామని పిలుపునిచ్చారు. చంద్రబాబును ముఖ్యమంత్రిగా చేసుకుంటేనే రాష్ట్రానికి మంచి భవిష్యత్తు ఉంటుందని ప్రజలకు అర్థమైపోయిందన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు వలసల సుధాకర్, బి.రామదుర్గం జయరాముడు తదితరులు పాల్గొన్నారు.

మసీదు కాంప్లెక్స్ ప్రారంభం

షాదీఖానా నిర్మించి ముస్లింలకు కానుకగా ఇస్తా: మాజీ ఎమ్మెల్యే బీసీ



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్‌రెడ్డి

బనగానపల్లె, ఫిబ్రవరి 25 : బనగానపల్లె పట్టణంలోని కొండపేటలోని చార్ కమాన్ మసీద్ ప్రాంగణంలో తమ సొంత డబ్బు రూ.3 లక్షలతో నిర్మించిన మసీద్ కాంప్లెక్స్‌ను మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్‌రెడ్డి, బనగానపల్లె పట్టణ మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి ఆదివారం ప్రారంభించారు. వీరికి వందలాదిమంది ముస్లింలు ఘన స్వాగతం పలికారు. చార్ కమాన్ మసీద్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్‌రెడ్డి మాట్లాడుతూ చార్‌కమాన్ మసీదు కమిటీ సభ్యులు తమను కోరగానే ఈ నిర్మాణం చేపట్టాని అన్నారు. ముస్లిం మైనార్టీల కోసం పట్టణంలో కోటి రూపాయలలో షాదీ ఖానా భవనాన్ని నిర్మించడానికి నిధులు మంజూరు చేయించానని అవి చాలకపోవడంతో సొంత నిధులు రూ.30 లక్షలు విరాళంగా అందించానన్నారు. ఆ షాదీఖానాను నిర్మిస్తుంటే ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి అడ్డుకొని తనపై పోలీసులు కేసులు పెట్టించారన్నారు. రాబోయే ఎన్నికల్లో తాము అధికారంలోకి వచ్చిన వెంటనే షాదీఖానాను 30 రోజుల్లో పూర్తి చేసి ముస్లింలకు కానుకగా అందిస్తామన్నారు. పట్టణ టీడీపీ ఉపసర్పంచ్ బురానుద్దీన్, పట్టణ టీడీపీ అధ్యక్షుడు కాశింబాబు, అమీర్, నియాజ్, అహమ్మద్‌హుసేన్, అల్లా బకాస్, వందలాది మంది ముస్లిం మైనార్టీ నాయకులు పాల్గొన్నారు. చార్‌కమాన్ మసీదు కమిటీ సభ్యులు మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్ రెడ్డి, బీసీరాజారెడ్డిలను ఘనంగా సత్కరించారు.

వైభవంగా సుదర్శన హోమం

నంద్యాల, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): ఎగువ అహోబిలంలో కొలువైన మాలోల నరసింహస్వామి సన్నిధిలో ఆదివారం సుదర్శన హోమాన్ని వేద పండితులు వైభవంగా నిర్వహించారు. ఈ ఏడాది జనవరి 16వ తేదిన నరసింహస్వామి దీక్ష తీసుకున్న భక్తులు హోమంలో పాల్గొన్నారు. అనంతరం దీక్షను విరమించారు. నరసింహస్వామి, గోవింద నామస్మరణలతో మాలోల సన్నిధి మార్మోగింది.





పరీక్ష కేంద్రంలోని సిబ్బందికి సూచనలిస్తున్న ఎస్పీ రఘువీర్‌రెడ్డి

ప్రశాంతంగా గ్రూప్-2 పరీక్ష: కలెక్టర్

నంద్యాల (కల్చరల్), ఫిబ్రవరి 25: జిల్లాలో ఏపీపీఎస్సీ గ్రూప్2 పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయని కలెక్టర్ డా.కె. శ్రీనివాసులు తెలిపారు. ఆదివారం ఉదయం 10.30 గంటల నుంచి 1.00 గంటల వరకు గ్రూప్-2 పరీక్షలు జరిగాయన్నారు. జిల్లాలో 44 పరీక్షా కేంద్రాల్లో గ్రూప్-2 పరీక్షలు నిర్వహించామని, 85.05 శాతం అభ్యర్థుల హాజరు నమోదైందన్నారు. పరీక్షలకు 14,670 మంది హాజ రు కావాల్సి ఉండగా 12,478 మంది పరీక్షకు హాజరయ్యారన్నారు.

పటిష్ట ఏర్పాట్ల మధ్య గ్రూప్-2 పరీక్ష: ఎస్పీ

నంద్యాల క్రైం, ఫిబ్రవరి 25 : ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహించిన గ్రూప్-2 పరీక్ష పకడ్బందీ ఏర్పాట్ల మధ్య జరిగిందని ఎస్పీ కె.రఘువీర్ రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన గ్రూప్-2 పరీక్షా కేంద్రాలైన న్యూక్లియర్ జూనియర్ కాలేజీ, నారాయణ జూనియర్ కాలేజీ, వెంకటేశ్వర జూనియర్ కాలేజీ, రామకృష్ణ డిగ్రీ కాలేజీ, నేషనల్ జూనియర్ కాలేజీ, డిగ్రీ కాలేజీ, శాంతినికేతన్ స్కూల్‌ల వద్ద అభ్యర్థులకు ఎలాంటి ఆటంకం కలుగకుండా అవసరమైన భద్రతా చర్యలు చేపట్టారు. అంతక ముందు ఎస్పీ ఈ కేంద్రాలను పరిశీలించి ఏర్పాట్లపై సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం పోలీస్ అధికారులు, సిబ్బందితో సమీక్షించారు. అవసరమైన సలహాలు, సూచనలు అందజేశారు. గ్రూప్-2 పరీక్ష ప్రశాంతంగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అలాగే పరీక్షా కేంద్రాల్లో విధులు నిర్వహిస్తున్న ఇన్విజిలేటర్లు ఇతర సిబ్బందితో మాట్లాడారు. పరీక్షలో ఎలాంటి మాస్ కాపీయింగ్, మాల్ ప్రాక్టీసింగ్ వంటి చర్యలకు ఎవరైనా పాల్పడితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పరీక్ష విధుల్లో పాల్గొనే సిబ్బంది, అభ్యర్థులు పరీక్షా కేంద్రాల్లోకి సెల్‌ఫోన్లు, ఎలక్ట్రానిక్ వస్తువులను తీసుకెళ్లకుండా చర్యలు చేపట్టారు. పరీక్షా కేంద్రాల సమీపంలో ఉండే జిరాక్స్ సెంటర్లను మూసివేయించారు. పరీక్ష పూర్తయ్యేవరకు అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించాలని పేర్కొన్నారు. పరీక్షా కేంద్రాల సందర్శనలో ఎస్పీతోపాటు స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ సంతోష్, ఇన్‌స్పెక్టర్లు చంద్రబాబునాయుడు, సూర్యమౌళి పాల్గొన్నారు.

జలాశయాలు.. ఎండిపోతున్నాయ్

- అత్తెసరు నీటిలో కూడా పక్క జిల్లాలకు..
- సీఎం మెప్పు కోసమే తరలింపు
- డెడ్ స్టోరేజీకి చేరిన నీరు
- జూలై వరకు తాగునీటి అవసరాలు తీర్చేదెలా...?

ఉమ్మడి కర్నూలు జిల్లాలో జలాశయాలు ఎండిపోతున్నాయి. నీటి నిల్వలు వేగంగా అడుగంటుతున్నాయి. ఇప్పుడే ఇట్లా ఉంటే రాబోయే వేసవిలో తాగు నీటికి ఎట్లా? అనే ఆందోళన మొదలైంది. దీన్ని పట్టించుకోకుండా అధికారులు సీఎం మెప్పు కోసం చిత్తూరు జిల్లాకు వారం రోజులుగా నీరు సరఫరా చేస్తున్నారు. కొద్ది రోజుల్లో చిత్తూరు జిల్లాలో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పర్యటన ఉంది. ఆ సందర్భంగా ఆ ప్రాంత ప్రజలు సీఎంను నిలదీసే ప్రమాదం ఉంది. దాన్ని నివారించడానికి కర్నూలు జిల్లాకు చెందాల్సిన నీటిని తరలిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి.


హంద్రీనీవా ప్రధాన పంపింగ్ కేంద్రం

కర్నూలు(అగ్రికల్చర్), ఫిబ్రవరి 25: ఈసారి వేసవిలో తాగు నీటికి కష్టమే. అప్పుడే ఉమ్మడి కర్నూలు జిల్లాలో ప్రమాద ఘంటికలు మోగుతున్నాయి. జిల్లాలోని జలాశయాలు అత్తెసరు నీటితో డెడ్ స్టోరేజీకి చేరుకున్నాయి. హంద్రీనీవా కాలువ నుంచి ముచ్చుమర్రి లిఫ్టు ద్వారా శ్రీశైలం జలాశయం నుంచి కర్నూలు జిల్లాలోని 77 చెరువులకు నీటిని అందించే కార్యక్రమాన్ని జలవనరుల శాఖ అధికారులు చేపట్టారు. అయితే.. సీఎం మెప్పు కోసం చిత్తూరు జిల్లాకు చెందిన అధికారుల ఒత్తిడిపై హంద్రీనీవా కాలువ నుంచి ఆ సర్కిల్ ఉన్నతాధికారులు కర్నూలు జిల్లాలోని జలాశయాలకు, చెరువులకు నీరు అందించే కార్యక్రమాన్ని పక్కనపెట్టి గత కొద్ది రోజులుగా నిరంతరాయంగా చిత్తూరుకు నీరు అందిస్తున్నారు. గత సంవత్సరం సెప్టెంబరు 19న ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి కర్నూలు జిల్లాలో 77 చెరువులకు హంద్రీనీవా కాలువ ద్వారా నీటిని అందించే కార్యక్రమాన్ని ప్రారంభించారు. చెరువుల కింద సాగు చేసిన పంటలను కాపాడుతామని, తాగునీటి ఎద్దడిని నివారిస్తామని ఈ సందర్భంగా జిల్లా ప్రజలకు, రైతాంగానికి సీఎం జగన్ హామీ ఇచ్చారు. ఆ మాటలు నీటిమూటలయ్యాయి. హంద్రీనీవా కాలువకు శ్రీశైలం జలాశయం నీటిని ముచ్చుమర్రి లిఫ్టు ద్వారా అందించేందుకు ఇక పది రోజులు మాత్రమే సమయం ఉంది. ఈ పరిస్థితుల్లో ఈ కొద్దిపాటి నీటినైనా కర్నూలు, నంద్యాల జిల్లాల్లోని 77 చెరువులు తీవ్ర దుర్భిక్ష పరిస్థితులు ఎదుర్కొంటున్న పశ్చిమ నియోజకవర్గాల్లోని చెరువులు, జలాశయాలకు అందించేందుకు చర్యలు తీసుకోవాల్సి ఉందని జలవనరుల శాఖ అధికారులు ప్రభుత్వానికి విన్నవించారు. అయితే.. కొద్ది రోజుల్లో చిత్తూరు జిల్లాలో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పర్యటించే కార్యక్రమం ఉన్నందున ఆ ప్రాంత ప్రజలు నీటి కోసం ముఖ్యమంత్రిని నిలదీసే ప్రమాదం ఉంది. అందుకని అధికారులు ఉమ్మడి కర్నూలు జిల్లాలోని రిజర్వాయర్లు, చెరువులకు నీటిని అందించే కార్యక్రమాన్ని పక్కన పెట్టి చిత్తూరు జిల్లాకు శ్రీశైలం జలాశయం నుంచి విడుదల చేస్తున్న 960 క్యూసెక్కుల నీటిని చిత్తూరు జిల్లాకే సరఫరా చేస్తున్నారు. దీనిపై కర్నూలు జిల్లాతో పాటు నంద్యాల జిల్లాల రైతులు, ప్రజలు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. తమ ప్రయోజనాలను ఫణంగా పెట్టి మరో జిల్లాకు నీటిని విడుదల చేయడం ఏమిటని వారు ప్రశ్నిస్తున్నారు. శ్రీశైలం జలాశయంలో 215 టీఎంసీల పూర్తి సామర్థ్యం కాగా, ఆదివారం నాటికి 39.03 టీఎంసీల నీటి నిల్వ మాత్రమే ఉంది. ముచ్చుమర్రి లిఫ్టు నుంచి శ్రీశైలం జలాశయం నీటిని 810 అడుగులకు చేరేంత వరకు మాత్రమే హంద్రీనీవా కాలువకు విడుదల చేసుకునే అవకాశం ఉంది. అయినా కూడా కర్నూలు జిల్లా ప్రయోజనాలను పక్కన పెట్టి చిత్తూరు జిల్లాకు నీటిని గత వారం రోజులుగా నిరంతరాయంగా విడుదల చేస్తుండటంపై ఉమ్మడి కర్నూలు జిల్లా రైతులు, ప్రజలు ఆగ్రహావేశాలు వ్యక్తం చేస్తున్నారు.

ఎండలు ముదురుతుండటంతో వేగంగా కరిగిపోతున్న నీటి నిల్వలు

వేసవి కాలం ఇంకా మొదలు కాకముందే ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఎండలు తమ ప్రతాపాన్ని చూపిస్తున్నాయి. రోజూ 38 డిగ్రీల ఉష్ణోగ్రత్త కర్నూలు జిల్లాలో నమోదవుతుంది. ఈ పరిస్థితుల కారణంగా అత్తెసురు జలాశయాల్లోని నీటి నిల్వలు వేగంగా ఆవిరైపోతున్నాయి. సుంకేసుల జలాశయంలో పూర్తి స్థాయి నీటి నిల్వ 1.2 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 0.242 టీఎంసీలు మాత్రమే నిల్వ ఉంది. క్రిష్ణగిరి రిజర్వాయరులో పూర్తి స్థాయి నీటి నిల్వ 0.164 టీఎంసీలు కాగా, ఆ నీటిని వచ్చే వేసవి కాలంలో తాగునీటి కోసం ఇప్పటి నుంచే జాగ్రత్తలు తీసుకుంటున్నారు. అయితే ఎండలు ముదరడంతో ఈ జలాశయంలో నీటి నిల్వలు త్వరితగతిన ఆవిరైపోయే పరిస్థితి ఉందని, హంద్రీనీవా కాలువ ద్వారా నీటిని ఈ జలాశయానికి కొంతలో కొంతైనా విడుదల చేస్తే, రాబోయే వేసవి కాలంలో తాగునీటి ఎద్దడిని నివారించవచ్చని జలవనరుల శాఖ అధికారులు చెబుతున్నారు. అదే విధంగా పందికోన జలాశయంలో పూర్తి స్థాయి నీటి నిల్వ 1.126 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 0.41 టీఎంసీలు మాత్రమే నిల్వ ఉంది. కొద్దిపాటి ఈ నిల్వ నీటితో వేసవి కాలంలో తాగునీటి ఎద్దడిని నివారించడం ఎలా అని జలవనరుల శాఖ అధికారులు తలపట్టుకున్నారు. 77 చెరువులకు నీటిని హంద్రీనీవా కాలువ ద్వారా నిరంతరాయంగా అందిస్తామని జలవనరుల శాఖ అధికారులు ప్రకటించడంతో రైతులు కంది, జొన్న, వేరుశనగ, మొక్కజొన్న తదితర పంటలను సాగు చేశారు. ఈ పంటలు చివరి దశలో ఉండటంతో మరో పదిహేను రోజులు నీరు అందించగలిగితే.. చేతికొచ్చే అవకాశం ఉంటుందని, లేకపోతే మట్టిపాలవుతాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. హంద్రీనీవా కాలువ ద్వారా విడుదలవుతున్న నీటి ద్వారా 44 చెరువులకు పూర్తి స్థాయిలో నీటిని నిల్వ చేయగలిగామని, మరో 33 చెరువులకు అంతంత మాత్రమే నీరు అందిందని అధికారులు స్పష్టం చేస్తున్నారు. ఇప్పటికైనా హంద్రీనీవా ప్రాజెక్టు అధికారులు కర్నూలు జిల్లాలో క్రిష్ణగిరి, పందికోన రిజర్వాయరులతో పాటు 77 చెరువులకు నీటిని అందించాలని, లేకపోతే రైతులు సాగు చేసిన పంటలు ఎండిపోవడంతో పాటు రాబోయే ఎండాకాలంలో తాగునీటి ఎద్దడిని నివారించడం కష్టమవుతుందని జలవనరుల శాఖ అధికారులు స్పష్టం చేస్తున్నారు.

ఉమ్మడి జిల్లాలో జలాశయాల్లో నీటి నిల్వ వివరాలు

జలాశయం	పూర్తి స్థాయి నీటి నిల్వ (టీఎంసీలలో)	ప్రస్తుతం నీటి నిల్వ (టీఎంసీలలో)
శ్రీశైలం	215	38.8
తుంగభద్ర	105.78	9.15
సుంకేసుల	1.2	0.228
గాజులదిన్నె	4.5	1.544
క్రిష్ణగిరి	0.164	0.164
వెలుగోడు	16.95	1.936
గోరుకల్లు	12.5	3.2
అవుకు	4.148	1.132
పందికోన	1.126	0.46
పులికనుమ	1.243	0.27

నేడు 'స్పందన'

కర్నూలు(కలెక్టరేట్), ఫిబ్రవరి 25: కర్నూలు కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో సోమవారం జరిగే స్పందన కార్యక్రమం ద్వారా ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తామని కలెక్టర్ డా.జి.సృజన ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంతోపాటు అన్ని మండల కేంద్రాలు, మున్సిపల్ కార్యాలయాలు, డివిజన్ స్థాయిలో కూడా స్పందన కార్యక్రమం జరుగుతుందన్నారు. ఈ విషయాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

విద్యుదాఘాతంతో బేకరిలో పొగలు


బేకరిలో కమ్ముకున్న పొగలు

బేతంచెర్ల, ఫిబ్రవరి 25: బేతంచెర్ల పట్టణం పాత బస్టాండు సమీపంలో ఉన్న వెంకటేశ్వర సినిమా టాకీస్ షాపింగ్ కాంప్లెక్స్‌లోని బెంగుళూరు బేకరిలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ సంభవించింది. దీంతో భారీగా పొగలు కమ్ముకొని సిబ్బంది బయటికి పరుగులు తీశారు. ఈ సంఘటన ఆదివారం జరిగింది. బెంగుళూరు బేకరి షాప్‌కు ఉన్న విద్యుత్ ప్లగ్స్ షార్ట్ సర్క్యూట్ కావడంతో వైర్లన్నీ కాలిపోవడంతో ఈ ఘటన జరిగింది. విద్యుత్ సిబ్బంది అప్రమత్తమై కరెంట్ సరఫరాను నిలిపివేశారు. దీంతో బేకరి సిబ్బంది ఊపిరి పీల్చుకున్నారు.

ఆటో బోల్తా పడి మహిళ మృతి

కోవెలకుంట్ల, ఫిబ్రవరి 25 : ఆటో బోల్తా పడి ఒక మహిళ మృతి చెందింది. ఈ సంఘటన మండలంలోని సౌదరదిన్నె గ్రామ పొలాల రస్తాలో ఆదివారం జరిగింది. బనగానపల్లె మండల పరిధిలోని ఎర్రగుడి -హుసేనాపురం గ్రామానికి చెందిన 15 మంది కూలీలు కోవెలకుంట్ల మండలం సౌదరదిన్నె గ్రామంలో మిరపంట కోయడానికి వెళ్తుండగా అదుపు తప్పి ఆటో బోల్తాపడి హసీనా (26)కు బలమైన గాయాలయ్యాయి. ఆమెను బనగానపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందింది. కోవెలకుంట్ల ఎస్సై వరప్రసాద్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

సెస్సు లక్ష్యం పూర్తి చేసేందుకు ప్రత్యేక టీమ్‌లు

కర్నూలు(అగ్రికల్చర్), ఫిబ్రవరి 25: పంట ఉత్పత్తులను కొంటున్న వ్యాపారుల నుంచి మార్కెటింగ్ ఫీజును వసూలు చేసేందుకు ఉమ్మడి కర్నూలు జిల్లాలో 15 మార్కెట్ కమిటీలకు నిర్దేశించిన లక్ష్యాన్ని మార్చి నెలాఖరులోపు పూర్తి చేయాలని మార్కెటింగ్ శాఖ జేడీ రామాంజనేయులు ఆదేశించారు. ఆదివారం విలేకరులతో ఫోన్‌లో మాట్లాడుతూ వ్యాపారులు రైతుల నుంచి కొనుగోలు చేస్తున్న పంట ఉత్పత్తులకు సంబంధించి మార్కెటింగ్ ఫీజును తప్పనిసరిగా చెల్లించాల్సి ఉందని అన్నారు. అయితే కొంత మంది వ్యాపారులు సెస్సును ఎగ్గొట్టేందుకు అనేక ప్రయత్నాలు చేస్తున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయని తెలిపారు. మార్కెట్ కమిటీల ఆదాయాన్ని పక్కదారి పట్టకుండా ఉమ్మడి కర్నూలు జిల్లాలో నాలుగు ప్రత్యేక టీములను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కర్నూలు జిల్లాలో రెండు, అదే విధంగా నంద్యాల జిల్లాలో రెండు టీములను ఏర్పాటు చేశామని, ఒక్కో టీములో ముగ్గురు అధికారులను నియమించామని అన్నారు. ఆదోని మార్కెట్ కమిటీకి సంబంధించి అసిస్టెంట్ సెక్రటరీ శాంతకుమార్ ఆధ్వర్యంలో ఆదోని, ఆలూరు, మంత్రాలయం, ఎమ్మిగనూరు మార్కెట్ కమిటీల్లో తనిఖీలు చేపడుతారన్నారు. కోవెలకుంట్ల మార్కెట్ కమిటీ సెక్రటరీ జయప్రకాష్ రెడ్డి ఆధ్వర్యంలోని టీము, నంద్యాల, ఆళ్లగడ్డ, కోవెలకుంట్ల, డోన్ మార్కెట్ కమిటీల్లో తనిఖీలు చేస్తాయన్నారు. నంద్యాల జిల్లాలో డోన్ మార్కెట్ కమిటి సెక్రటరీ మాధవరెడ్డి నేతృత్వంలోని టీమ్, పాణ్యం, నందికొట్కూరు, బనగానపల్లె, ఆత్మకూరు మార్కెట్ కమిటీలలో సెస్సు వసూళ్ల వివరాలను చేపడుతాయన్నారు. పత్తికొండ మార్కెట్ కమిటీ సెక్రటరీ కార్నలీస్ టీమ్ ఆధ్వర్యంలోని బృందం కర్నూలు, కోడుమూరు, పత్తికొండ మార్కెట్ కమిటీల్లో సెస్సు వసూళ్లకు సంబంధించిన వివరాలను సేకరిస్తాయన్నారు.

డైరెక్టరుగా ఐఏఎస్‌ను నియమించండి

- ఉమ్మడి జిల్లా పశుసంవర్ధక శాఖ యూనియన్ చైర్మన్ వెంకటేశ్వర్లు


మాట్లాడుతున్న యూనియన్ చైర్మన్ వెంకటేశ్వర్లు

కర్నూలు(అగ్రికల్చర్), ఫిబ్రవరి 25: పశుసంవర్ధక శాఖకు ప్రభుత్వం ఐఏఎస్ అధికారిని నియమించాలని ఆ శాఖ నాన్ గ్రాడ్యుయేట్ వెటర్నేరియన్స్ సంఘం యూనియన్ల ఉమ్మడి జిల్లా చైర్మన్ వెంకటేశ్వర్లు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఆదివారం కలెక్టరేట్‌లోని పశుసంవర్ధక శాఖ గోకులం సమావేశ మందిరంలో నాన్ గ్రాడ్యుయేట్ వెటర్నేరియన్స్ మూడు సంఘాల ఉమ్మడి జిల్లా కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో చైర్మన్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ పశుసంవర్ధకశాఖలో అధికారులు తమ పోస్టులను, హోదాను పెంచుకోవడానికి ప్రయత్నించడం తప్ప రైతులకు క్షేత్రస్థాయిలో సేవలందిస్తున్న సిబ్బంది బాగోగులపై ఏ మాత్రం దృష్టి పెట్టడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో పశు సంపదను అస్తవ్యస్తంగా లెక్క చూపుతున్నారని, పశువులకు వ్యాక్సినేషన్ చేయమని, ట్యాగులు వేయమని ఆన్‌లైన్‌లో నమోదు చేయమని కింది స్థాయి ఉద్యోగులను వేధించడం అలవాటుగా మారిపోయిందని అన్నారు. ఇదంతా తెలిసి కూడా రాష్ట్ర స్థాయి అధికారులు ఆన్‌లైన్ పురోగతి నివేదికల పేరుతో ప్రభుత్వాన్ని మోసం చేస్తున్నారని ఆరోపించారు. దీనికంతటికీ కారణం బీవీఎస్సీ చదివిన అధికారులే పశుసంవర్థక శాఖకు రాష్ట్ర స్థాయి డైరెక్టరుగా ఉండటమని అన్నారు. గ్రామీణ పశు వైద్యశాలలను రీఆర్గనైజేషన్, అప్‌గ్రేడేషన్, క్లస్టర్ వ్యవస్థ అనే రకరకాల పేర్లతో సిబ్బందికి భవిష్యత్తు లేకుండా చేయడానికి కుట్రలు చేస్తున్నారని అన్నారు. వీటిని ప్రభుత్వం పరిశీలించి రైతుల క్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ఐఏఎస్ అధికారిని పశుసంవర్థక శాఖకు డైరెక్టరుగా నియమించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎల్ఎస్ఏ జిల్లా అధ్యక్షుడు బజారి, ఇతర నాయకులు జనార్దన్ రెడ్డి, చంద్ర యాదవ్, సుబ్బరాయుడు, ఉమామహేశ్వరి దేవి, సులోచన, వరప్రసాద్ పాల్గొన్నారు.

రాజీనామాలకు సిద్ధం!

- కర్నూలు వైసీపీలో ధిక్కార స్వరం
- అసంతృప్తితో ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్ వర్గం
- రాజీనామాలకు సై అంటున్న కౌన్సిలర్లు?
- రగులుతున్న టికెట్ చిచ్చు

కర్నూలు, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): కర్నూలు నియోజకవర్గం వైసీపీలో ధిక్కార స్వరం పెరుగుతోంది. ఎమ్మెల్యే హఫీజ్ ఖాన్‌కు టికెట్ ఇవ్వకపోతే తాము మూకుమ్మడిగా రాజీనామాలకు సిద్ధం అంటూ పలువురు కార్పొరేటర్లు, ఆ పార్టీ సీనియర్ నాయకులు పరోక్షంగా హెచ్చరికలు జారీ చేసినట్లు సమాచారం. వైసీపీ సమన్వయకర్త (రాబోయే ఎన్నికల్లో అభ్యర్థి)గా డాక్టర్ ఇలియాస్‌బాషా పేరు ఖరారైందని.. రేపోమాపో అధికారికంగా ప్రకటించే అవకాశం ఉందనే సమచారం బయటకు రావడంతో హఫీజ్‌ఖాన్ వర్గీయులు రగిలిపోతున్నారు. గురువారం అర్ధరాత్రి వైసీపీ జిల్లా అధ్యక్షుడు, కర్నూలు నగర పాలక సంస్థ మేయర్ బీవై రామయ్య ఆఫీస్ ముట్టడించేందుకు వెళ్లారు. అయితే.. ఆ సమయంలో ఆయన లేకపోవడం.. ఇది మంచి పద్ధతి కాదంటూ ఎమ్మెల్యే కూడా ఆగ్రహం వ్యక్తం చేయడంతో వెనుదిరిగినట్లు సమాచారం. నష్ట నివారణ చర్యల్లో భాగంగా ఆదివారం ఆ పార్టీ రీజినల్ కో-ఆర్డినేటర్, ఎమ్మెల్సీ రాంసుబ్బారెడ్డి ప్రత్యేక సమావేశం నిర్వహించారు. హఫీజ్‌ఖాన్‌కు టికెట్ నిరాకరిస్తే తాము కూడా వైసీపీని నిరాకరించాల్సి వస్తుందంటూ తేల్చి చెప్పగా.. అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్తానని రాంసుబ్బారెడ్డి హామీ ఇచ్చినట్లు తెలిసింది.

- వైసీపీ అధినేత, సీఎం జగన్ కర్నూలు ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్‌కు హఫీజ్‌ఖాన్‌కు జగన్ మొండి చేయి చూపించారనే ప్రచారం జోరుగా సాగుతోంది. ఇది ఆయన వర్గీయులకు మింగుడు పడడం లేదు. అధిష్ఠానంపై ధిక్కార స్వరం వినిపించేందుకు సిద్ధమయ్యారు. గురువారం ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్ విజయవాడ తాడేపల్లిలోని సీఎం క్యాంప్ ఆఫీసులో ముఖ్యమంత్రి జగన్, ప్రభుత్వ ప్రధాన సలహాదారుడు సజ్జల రామకృష్ణారెడ్డిలను కలిశారు. రాబోయే ఎన్నికల్లో టికెట్ ఇవ్వడం లేదని, ప్రమోషన్ ఇస్తున్నానని జగన్ తేల్చి చెప్పినట్లు సమాచారం. ఈ విషయం తెలియగానే హఫీజ్‌ఖాన్ వర్గానికి చెందిన కార్పొరేటర్లు, ముఖ్య నాయకులు ఆగ్రహంతో రగిలిపోయారు. తాడోపేడో తేల్చుకుందామని అదే రోజు అర్ధరాత్రి వైసీపీ జిల్లా అధ్యక్షుడు, నగర పాలక సంస్థ మేయర్ బీవై రామయ్య క్యాంప్ ఆఫీసుకు వెళ్లారు. అయితే ఆ సమయంలో ఆయన అక్కడ లేకపోవడంతో వెనుదిరిగినట్లు సమాచారం.

● కో-ఆర్డినేటర్ సమక్షంలో ప్లకార్డుల ప్రదర్శన:

దిద్దుబాటు చర్యలో భాగంగా హఫీజ్‌ఖాన్ వర్గానికి చెందిన కార్పొరేటర్లు, ముఖ్య నాయకులతో వైసీపీ రీజినల్ కో-ఆర్డినేటర్, కడప జిల్లా ఎమ్మెల్సీ రాంసుబ్బారెడ్డి, జిల్లా అధ్యక్షుడు, మేయర్ బీవై రామయ్యలు ప్రత్యేకంగా భేటీ అయ్యారు. దీంతో హఫీజ్‌ఖాన్‌కు టికెట్ ఇవ్వాల్సిందే అంటూ ప్లకార్డులు ప్రదర్శించారు. తమ నాయకుడికి టికెట్ ఇవ్వకపోతే పార్టీలో ఉండబోమని అల్టిమేటమ్ జారీ చేశారు. వేదిక వద్దకు చేరుకొని రాంసుబ్బారెడ్డితో వాగ్వాదానికి దిగారు. ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్, మేయర్ బీవై రామయ్యలు సర్ది చెప్పేందకు ప్రయత్నించినా పట్టించుకోలేదు. ఓ దశలో రాంసుబ్బారెడ్డి గట్టిగా మాట్లాడాల్సి వచ్చింది. వారి అభిప్రాయాలను అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్తానని చెప్పినట్లు సమాచారం. ఆ మాటలకు ఆగ్రహంతో ఊగిపోయిన ఎమ్మెల్యే వర్గీయులు.. మీ చేతుల్లో లేనప్పుడు ఈ మీటింగ్‌కు ఎందుకు వచ్చారంటూ రాజీనామాలు చేస్తామని ధిక్కార స్వరం వినిపించారు. ఇది గమనించిన ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్ జోక్యం చేసుకొని అధిష్ఠానం నిర్ణయానికి అందరు కట్టుబడి ఉండాలని చెప్పారు.


వైసీపీ రీజినల్ కో-ఆర్డినేటర్ రాంసుబ్బారెడ్డితో వాగ్వాదానికి దిగిన హఫీజ్‌ఖాన్ వర్గీయులు


కార్యకర్తల సమవేశంలో ప్లకార్డులు ప్రదర్శిస్తున్న ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్ వర్గీయులు

● టీడీపీ వైపు చూస్తున్న అహ్మద్ అలీఖాన్!:

'రాబోయే ఎన్నికల్లో ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్‌కు టికెట్ ఇవ్వరు.. మీకే టికెట్.. మీరే వైసీపీ అభ్యర్థి అంటూ' ఐప్యాక్ టీం కీలక సభ్యులు డీసీసీ అధ్యక్షుడు అహ్మద్ అలీఖాన్‌ను నమ్మించారు. దీంతో అహ్మద్ అలీఖాన్ కాంగ్రెస్ సభ్యత్వానికి, డీసీసీ అధ్యక్ష పదవికి రాజీనామా చేసి సీఎం జగన్ సమక్షంలో వైసీపీలో చేరారు. అప్పటి వరకు ఊహల్లో పరుగులు పెట్టించిన ఐప్యాక్ సభ్యులు ఆ తరువాత ఆయన గురించి పట్టించుకోవడమే మానేశారు. ఉన్నట్టుండి డాక్టర్ ఇలియాస్‌బాషా పేరును తెరపైకి తేవడంతో అహ్మద్ అలీఖాన్ వర్గీయులు అసంతృప్తితో రగిలిపోతున్నారు.. టికెట్ ఇస్తామని మోసం చేసిన వైసీపీని వీడి టీడీపీలో చేరేందుకు సన్నాహాలు చేసుకుంటున్నట్లు సమాచారం.

● వేచి చూద్దాం..!:

కర్నూలు వైసీపీ టికెట్ కోసం మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డి, కేడీసీసీబీ చైర్‌పర్సన్ ఎస్వీ విజయమనోహరి దంపతులు తీవ్రంగా ప్రయత్నాలు చేశారు. తమ ఇద్దరిలో ఒకరికి అకాశం ఇవ్వాలని సీఎం జగన్, ప్రభుత్వ సలహాదారుడు సజ్జల రామకృష్ణారెడ్డి తదితరుల దృష్టికి తీసుకెళ్లారు. అధిష్ఠానం ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యేలను కాదని కొత్త వ్యక్తిని తెరపైకి తెచ్చింది. ఈ నేపథ్యంలో వేచిచూద్దాం..! అనే ధోరణిలో ఎస్వీ దంపతులు, ఆయన వర్గీయులు ఉన్నట్లు సమాచారం.

యువతి కిడ్నాప్ కలకలం

- స్కార్పియో వాహనంతో బైక్‌ను ఢీకొట్టి..
- యువతిని ఎత్తుకెళ్లిన నిందితులు
- తండ్రి ఫిర్యాదుతో రంగంలోకి దిగిన పోలీసులు
- పత్తికొండ శివారులో దుండగుల అరెస్టు



అరెస్టు చేసిన నిందితులను చూపుతున్న పోలీసులు

పత్తికొండ, ఫిబ్రవరి 25: తండ్రితో మోటారు సైకిల్‌పై పత్తికొండకు ఆసుపత్రికి వెళ్తుండగా.. స్కార్పియో వాహనంలో వచ్చిన నిందితులు వాహనాన్ని అటకాయించి యువతిని బలవంతంగా తీసుకెళ్లారు. అడ్డుకోబోయిన తండ్రిని రివాల్వరుతో బెదిరించి వాహనంలో వెళ్లిపోయారు. తండ్రి ఫిర్యాదు మేరకు యువతి కిడ్నాప్‌పై అన్ని స్టేషన్లకు సమాచారం ఇచ్చిన పోలీసులు నాలుగు గంటల్లోపే పత్తికొండ శివారులో నిందితులను పట్టుకొని స్టేషన్‌కు తరలించారు. పత్తికొండ మండలం పులికొండ గ్రామానికి చెందిన వరదరాజుల నాయుడు కూతురు శ్రీదేవికి ఆరోగ్యం బాగలేకపోతే పత్తికొండ ఆసుపత్రిలో చూపించేందుకు తన మోటారుసైకిల్‌పై బయలుదేరారు. వీరు ప్రయాణిస్తున్న మోటారు సైకిల్ దూదేకొండ గ్రామం దాటి సుగాల నాగమ్మ దేవాలయం చేరుకునే సమయానికి వెనుక నుంచి వచ్చిన స్కార్పియో వాహనం వేగంగా వీరికి అడ్డుగా ఆగింది. మోటారు సైకిల్‌కు అడ్డగా స్కార్పియోతో ఆపిందెవరా అని గుర్తించేలోగా కప్పట్రాళ్లకు చెందిన సత్యనారాయణ నాయుడు, ఈదుల దేవరబండకు చెందిన అబ్దుల్ కలాం, కరివేములకు చెందిన విష్ణు, కప్పట్రాళ్లకు చెందిన బతుకన్నలు వాహనం నుంచి దిగి మోటారు సైకిల్‌పై ఉన్న శ్రీదేవిని బలవంతంగా స్కార్పియోలోకి ఎక్కించేందుకు ప్రయత్నించారు. దీంతో తండ్రి వరదరాజుల నాయుడు వీరిని అడ్డుకునేందుకు ప్రయత్నించగా అబ్దుల్ కలాం రివాల్వర్ తీసి బెదిరించాడు. పక్కనే ఉన్న కృష్ణ, బతుకన్నలు ఆయనపై దాడి చేసి పక్కకు రోడ్డుపైకి తోసేశారు. తేరుకునేలోపే శ్రీదేవిని స్కార్పియో వాహనంలో బలవంతంగా ఎక్కించుకుని వెళ్లిపోయారు. దీంతో తేరుకున్న తండ్రి వరదరాజుల నాయుడు తన కూతురు కిడ్నాప్ విషయాన్ని పత్తికొండ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వెంటనే రంగంలో దిగిన సీఐ మురళీ మోహన్ కిడ్నాపుకు సంబంధించిన వివరాలను, స్కార్పియో వాహన వివరాలను చుట్టుపక్క పోలీస్‌స్టేషన్లకు సమాచారం అందించారు. పత్తికొండ పరిసర ప్రాంతాల్లో స్కార్పియో వాహనం ఆచూకీ కోసం పోలీసులు వాహనాల్లో తనిఖీలు చేపట్టారు. మధ్యాహ్నం 1.30 గంటల ప్రాంతంలో పత్తికొండ సమీపంలో హోసూరు రోడ్డులో బైపాస్ వద్ద స్కార్పియో వాహనాన్ని గుర్తించి వారిని అదుపులోకి తీసుకున్నారు. వాహనంలో ఉన్న సత్యనారాయణ నాయుడు, బతుకన్నలతోపాటు కిడ్నాపుకు గురైన శ్రీదేవిని స్టేషన్‌కు తరలించారు. మరో ఇద్దరు కృష్ణ, అబ్దుల్ కలాం పరారీలో ఉన్నారు. సత్యనారాయణ నాయుడు, బతుకన్నలపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలిస్తున్నామని సీఐ తెలిపారు. వీరు ఉపయోగించిన రివాల్వర్, స్కార్పియో వాహనాన్ని స్వాధీనం చేసుకున్నామని చెప్పారు.


నిందితులు ఉపయోగించిన స్కార్పియో వాహనం

● ప్రేమ వ్యవహారమే కారణమా..?

కిడ్నాప్‌కు ప్రయత్నించిన సత్యనారాయణ నాయుడు వరదరాజుల నాయుడుకు సమీప బంధువు. వరుసకు అల్లుడు కావడంతో కూతురు శ్రీదేవిని వివాహం చేసుకుంటానని రెండు సంవత్సరాల క్రితం బంధువుల ద్వారా అడిగి చూశారు. అయితే సత్యనారాయణ నాయుడుకు కూతురును ఇచ్చేందుకు వరదరాజుల నాయుడు అంగీకరించకపోవడంతో పెళ్లి కుదరలేదు. కాగా సత్యనారాయణ నాయుడు శ్రీదేవిని వివాహం చేసుకునేందుకే కిడ్నాప్‌నకు యత్నించినట్లు సమాచారం.

యువకుడి ఆత్మహత్య

బేతంచెర్ల, ఫిబ్రవరి 25: పట్టణంలోని రేగుమానిపేటకు చెందిన ఎరుకలి సాయికృష్ణ (26) ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు తాడుతో ఉరి వేసుకున్నాడు. ఈ సంఘటన ఆదివారం జరిగింది రేగుమానిపేటలో నివాసముంటున్న ఎరుకల సుంకన్న, సుబ్బమ్మల కుమారుడు సాయికృష్ణ భారత్ గ్యాస్‌లో పని చేస్తున్నాడు. సుంకన్న, సుబ్బమ్మ తాళ్ల వ్యాపారం నిమిత్తం శనివారం వెళ్లారు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో సాయిక్రిష్ణ ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. తల్లిదండ్రులు ఇంటికి వచ్చాక సాయిక్రిష్ణ తలుపులు తీయకపోవడంతో డోర్ పగులకొట్టి చూశారు. సాయిక్రిష్ణ ఫ్యాన్‌కు వేలాడుతూ శవమై కనిపించాడు.

ఉరివేసుకొని బాలుడు..

బేతంచెర్ల, ఫిబ్రవరి 25: పట్టణంలోని సుబ్బారెడ్డినగర్ కాలనీలో నివాసముంటున్న ఓ కుటుంబానికి చెందిన బాలుడు ఇంట్లో ఎవరూ లేని సమయంలో తాడుతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన ఆదివారం సాయంత్రం చోటు చేసుకుంది. తల్లిదండ్రులు గమనించి హుటాహుటిన బేతంచెర్ల ఆసుపత్రికి తరలించేలోపే బాలుడు మృతి చెందాడని వైద్యులు నిర్ధారించారు.

రాష్ట్రంలో అరాచక పాలన: టీడీపీ



సభలో ప్రసంగిస్తున్న ఎన్ఎండీ ఫరూక్

నంద్యాల (నూనెపల్లె), ఫిబ్రవరి 25: వైసీపీ పాలనలో అభివృద్ధిని విస్మరించి దోపిడీలు, దౌర్జన్యాలు, అరాచకాలు సృష్టించి సర్వనాశనం చేశారని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు, నంద్యాల టీడీపీ అభ్యర్థి ఎన్ఎండీ ఫరూక్ మండిపడ్డారు. నంద్యాలలోని నూనెపల్లె వాటర్ ట్యాంక్ సమీపంలో ఆదివారం రాత్రి 'సమరానికి సంసిద్ధం సభ' నిర్వహించారు. వివిధ వార్డుల టీడీపీ ఇన్‌చార్జులు వాకా శివశంకర్‌యాదవ్, వెంకటేశ్వర్లు, మంజుల సుబ్బరాయుడు, జయప్రకాష్ ఆధ్వర్యంలో సభ సాగింది. ఫరూక్‌తో పాటు టీడీపీ జిల్లా అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్, రాష్ట్ర కార్యదర్శులు వెదుర్ల రామచంద్రరావు, తాతిరెడ్డి తులసిరెడ్డి, ఏవీఆర్ ప్రసాద్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండీ ఫిరోజ్, టీడీపీ పార్లమెంట్ యువ విభాగం అధ్యక్షుడు భూమా జగత్‌విఖ్యాత్‌రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఫరూక్ మాట్లాడుతూ నంద్యాలలో జరిగిన అభివృద్ధి అంతా టీడీపీ హయాంలోనే జరిగిందని, శిల్పా కుటుంబం వారి వ్యాపారాలను కాపాడుకునేందుకే రాజకీయాలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. నాయకులు మాట్లాడుతూ ప్రజలు వైసీపీని నమ్మే పరిస్థితుల్లో లేరన్నారు. టీడీపీ కౌన్సిలర్లు, మాజీ కౌన్సిలర్లు, జనసేన నాయకులు సుధాకర్, సాయి, సందీప్, నగేష్, అశోక్, టీడీపీ, జనసేన కార్యకర్తలు, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

ఓటమి భయంతో శిల్పా ప్రలోభాలు

● టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఫిరోజ్



ఛాయ్ పే చర్చలో మాట్లాడుతున్న ఫిరోజ్

నంద్యాల రూరల్, ఫిబ్రవరి 25: ఓటమి భయంతో నంద్యాల ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి ప్రతిపక్ష నాయకులు, కార్యకర్తలను ప్రలోభ పెడుతున్నారని టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఫిరోజ్ ఆరోపించారు. నంద్యాల మండలంలోని కానాల గ్రామంలో ఆదివారం ఛాయ్ పే చర్చ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఫిరోజ్ మాట్లాడుతూ శిల్పా కుటుంబం తన రియల్ ఎస్టేట్ భూ దందాల కోసమే కానాల పరిసర ప్రాంతాల రైతుల భూములను బలవంతంగా తక్కువ ధరకు తీసుకుంటోందని ఆరోపించారు. ఈ కుటుంబ భూ దాహానికి పేద రైతులు బలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రెండు దశాబ్దాల పాటు ఎమ్మెల్యేలుగా ఉన్న శిల్పా కుటుంబ హయాంలో కానాల రోడ్లు, కాలువలు, వీధి దీపాలకు సైతం నోచుకోలేదని విమర్శించారు. ఎన్నికల సమయంలో తమ ఏజెంట్లతో డబ్బులు పంచుతూ ఓట్లు పొందే శిల్పాకు కేవలం రియల్ ఎస్టేట్, డబ్బు యావ తప్ప ప్రజా సమస్యలు పట్టవని మండిపడ్డారు.

పేదల సమస్యలపై నిరంతర పోరాటం: సీపీఐ



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి రంగనాయుడు

గోస్పాడు, ఫిబ్రవరి 25: దేశ వ్యాప్తంగా పేద ప్రజల పక్షాన నిలిచి వారి సమస్యలపై నిరంతరం పోరాడుతూ అండగా నిలిచేది ఎర్రజెండానేనని సీపీఐ జిల్లా కార్యదర్శి రంగనాయుడు అన్నారు. ఆదివారం గోస్పాడులో సీపీఐ సమావేశం మండల నాయకుడు జిలానీ బాషా అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా రంగనాయుడు, జిల్లా సహాయ కార్యదర్శి బాబాఫక్రుద్దీన్ హాజరయ్యారు. వారు మాట్లాడతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్పొరేట్లకు రెడ్ కార్పెట్ వేస్తూ కార్మిక, శ్రామికులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నాయని ఆరోపించారు. మండల కార్యదర్శి హరినాథ్, సోమన్న, ఏఐటీయూసీ కార్యదర్శి శ్రీనివాసులు, మహిళా సమాఖ్య జిల్లా సహాయ కార్యదర్శి లక్ష్మీదేవి పాల్గొన్నారు.

'అర్హులందరికీ సంక్షేమ పథకాలు'

గడివేముల, ఫిబ్రవరి 25: అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నామని పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. మండలంలోని బిలకలగూడురు గ్రామంలో సచివాలయం, రైతు భరోసా కేంద్రాలను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అలగనూరు రిజర్వాయర్ మరమ్మతులకు చర్యలు తీసుకుంటామన్నారు. జడ్పీటీసీ ఆర్‌బీ చంద్రశేఖర్‌రెడ్డి, ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం ప్రెసిడెంట్ చంద్రశేఖర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ శివరామిరెడ్డి, మేఘనాథ్‌రెడ్డి, రఘుమాధవ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హోరాహోరీగా గాడిదల పందెం

నంద్యాల (కల్చరల్), ఫిబ్రవరి 25: నంద్యాల జంబులా పరమేశ్వరి అమ్మవారి తిరుణాల సందర్భంగా ఆదివారం గాడిదల పందెం హోరాహోరీగా సాగింది. ఆలయ ప్రధాన కార్యదర్శి గాండ్ల జగన్, టీడీపీ నాయకుడు జిల్లెల్ల శ్రీరాములు తదితర ప్రముఖులు గాడిదెల పందెంను ప్రారంభించారు. పెద్ద వంగలి పెద్ద పాములేటి, జంగాలపల్లె చాకలి అంజి, మిట్టపల్లె కళ్యాణ్, బాచిపల్లె నాగవైష్ణవి, బాచిపల్లె నాగేష్, వెల్పనూరు ఎల్ల నాగమయ్య, మిట్టపల్లె పెద్దయ్య, కొత్తపల్లె నరసింహులుకు చెందిన గాడిదలు గెలుపొందాయి. పోటీల్లో గెలిచిన టాప్ 8 గాడిదల యజమానులకు వరుసగా రూ.10 వేలు, రూ.8 వేలు, రూ.6 వూలు, రూ.4 వేలు, రూ.3 వేలు, రూ.2 వేలు, రూ.1500, వెయ్యి రూపాయలు నగదును పంపిణీ చేశారు.

3న జిల్లా స్థాయి చిత్రలేఖన పోటీలు

నంద్యాల (కల్చరల్), ఫిబ్రవరి 25: దివంగత ఎంఆర్ గోవిందరెడ్డి, ఆర్‌సీ కంబగిరిరాజుల జ్ఞాపకార్థం 9వ జిల్లా స్థాయి చిత్రలేఖన పోటీలు మార్చి 3వ తేదీన నిర్వహిస్తున్నట్లు ప్రముఖ చిత్రకారులు చిత్తలూరి రాంప్రసాద్, చింతలపల్లె కోటేష్ తెలిపారు. ఈ పోటీలు నంద్యాల వివేకానంద ఆడిటోరియంలో ఉదయం 9.00గంటలకు ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. చిత్రలేఖనంలో పోట్రెయిట్ పోటీకి 5 నిమిషాలముందు పోట్రెయిట్ చిత్రాన్ని చూసి వేయాల్సి ఉంటుందని చెప్పారు. 8,9,10వ తరగతుల బాలబాలికలకు మాత్రమే పోటీలో పాల్గొనడానికి అర్హులని తెలిపారు. మొదటి మూడు బహుమతులు వరుసగా 2 గ్రాముల బంగారు పతకం, 20 గ్రాముల వెండి పతకం, 10 గ్రాముల వెండి పతకం, పాల్గొన్న ప్రతి ఒక్కరికీ ప్రశంసా పత్రం అందించనున్నట్లు తెలిపారు. మరిన్ని వివరాలకు సెల్‌నెం.9966639299, 9866760490 నెంబర్లను సంప్రదించాలన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

నంద్యాల రూరల్, ఫిబ్రవరి 25: భర్తను, కుమార్తెను కోల్పోయిన బాధితురాలికి ఏపీ ఎరుకలి సమాఖ్య చేయూత అందించింది. నూనెపల్లె ఏకలవ్య నగర్‌లో ఉంటున్న ఎరుకలి భూలక్ష్మి ఇటీవల భర్తతో పాటు కుమార్తెను కోల్పోయారు. ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఎరుకలి భూ లక్ష్మికి ఏపీ ఎరుకలి సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు సుబ్బారావు, జిల్లా అధ్యక్షుడు పెనుగొండ నాగార్జున తదితరులు ఆదివారం రూ. 5వేల ఆర్థిక సాయం అందించారు. వారి వెంట అసోసియేట్ ప్రెసిడెంట్ నల్లబోతుల కృష్ణయ్య, కోశాధికారి ఆనంద్, కార్యదర్శి లింగమయ్య తదితరులు ఉన్నారు.

సీట్ల ప్రకటనతో తాడేపల్లి ప్యాలెస్‌లో ప్రకంపనలు: బుడ్డా



బుడ్డా సమక్షంలో టీడీపీలో చేరిన వైసీపీ నాయకులు

ఆత్మకూరు, ఫిబ్రవరి 25: టీడీపీ, జనసేన పార్టీల ఉమ్మడి అభ్యర్థుల ప్రకటన రాగానే సీఎం జగన్ నివాసమైన తాడేపల్లి ప్యాలెస్‌లో ప్రకంపనలు మొదలయ్యాయని శ్రీశైలం మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి అన్నారు. ఆత్మకూరు పట్టణంలోని ఇస్లాంపేటలో ఆదివారం వైసీపీ నాయకులు షేక్ ఆవుల రసూల్, ఆవుల మాబుసా, షేక్ షఫీవుల్లా, జామపండు నజీర్, అమ్ముల్లా ఆధ్వర్యంలో సుమారు 50కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలోకి చేరాయి. వీరికి మాజీ ఎమ్మెల్యే బుడ్డా టీడీపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. మాజీ సర్పంచ్ కంచర్ల గోవిందరెడ్డి, టీడీపీ పట్టణాధ్యక్షులు వేణుగోపాల్, టీడీపీ ప్రధాన కార్యదర్శి అబ్దుల్లాపురం బాషా, మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షులు కలిముల్లా, నాయకులు షాబుద్దీన్, నజీర్, రవీంద్ర, రమేష్‌గౌడ్, రాజారెడ్డి, గౌస్, తదితరులు ఉన్నారు.

● కరివేన గ్రామంలోని ఎస్సీ కాలనీకి చెందిన స్వాములు, దేవదాసు, కృష్ణా, పెద్దమల్లయ్య, విజయ్‌కుమార్, వంశీ, రాజేష్‌తో పాటు మరో 50 కుటుంబాలు వైసీసీని వీడి టీడీపీలోకి చేరాయి. అలాగే ఇదే గ్రామానికి చెందిన షేక్‌ఇమామ్ సాహేబ్, నబీరసూల్, ముర్తుజా, మాసుంగోరీ, వలి, జిలానీతో పాటు మరో 30కుటుంబాలు టీడీపీలోకి చేరాయి. వీరికి శ్రీశైలం మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి టీడీపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఆయన మాట్లాడుతూ కరివేన గ్రామాభివృద్ధికి కృషి చేస్తామన్నారు. నాయకులు కంచర్ల గోవిందరెడ్డి, శివప్రసాద్‌రెడ్డి, మల్లికార్జునరెడ్డి, శివశంకరశర్మ, కలిముల్లా, నాగేంద్ర, ఓబులేసు, జనసేన నాయకులు శ్రీరాములు తదితరులు ఉన్నారు.

బండిఆత్మకూరు: శ్రీశైలం నియోజకవర్గంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు సైనికుల్లా దూసుకెళ్లాలని టీడీపీ అభ్యర్థి బుడ్డా రాజశేఖరరెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం బుడ్డా రాజశేఖరరెడ్డి, ఆయన సతీమణి శైలజకు మండల నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున అభినందనలు తెలిపారు. టీడీపీ, జనసేన మండల అధ్యక్షులు నరసింహారెడ్డి, సురేష్, సొసైటీ మాజీ చైర్మన్ కంచర్ల మనోహర్‌చౌదరి, జాకీర్, సిద్ధయ్య, లాయర్ కృష్ణారెడ్డి, సాయిబాబారెడ్డి, మల్లేశ్వరరెడ్డి, షేక్ బాబు, సుధాకర్, శేఖర్, అన్వర్, శీను, నాగేశ్వరరావు, కొత్తూరయ్య, నందయ్య, తిరుపాల్ పాల్గొన్నారు.

కుట్టు మిషన్ల పంపిణీ



కుట్టు మిషన్లు పంపిణీ చేస్తున్న పద్మశాలి సంఘం నాయకులు

నంద్యాల (కల్చరల్), ఫిబ్రవరి 25: నంద్యాల భద్రావతీభావనాఋషి ఆలయంలో ఆదివారం కర్నూలు జిల్లా పద్మశాలి సంఘం అధ్యక్షుడు భీమునిపల్లె వెంకటసుబ్బయ్య నిర్వహణలో పద్మశాలీయ కులానికి చెందిన పేద మహిళలు 50 మందికి కుట్టు మిషన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ భీమనపల్లె పురందర్, పున్నా శేషయ్య, నంద్యాల పద్మశాలీయ సంఘం సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

'వాయిదాను ఖండిస్తున్నాం'

నంద్యాల (నూనెపల్లె), ఫిబ్రవరి 25: రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ఏపీజేఏసీతో జరిపిన చర్చలకు సంబంధించి మినిట్స్ విడుదల చేయడంతోనే విజయంగా భావించి ఏపీజేఏసీ ఫిబ్రవరి 27న తలపెట్టిన ఛలో విజయవాడ పిలుపును అర్ధాంతరంగా వాయిదా వేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని ఎస్టీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నాగరాజు, రామకృష్ణ, జిల్లా ఉపాధ్యక్షుడు రాము అన్నారు. ఆదివారం నంద్యాలలోని ఎస్టీటీఎఫ్ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మికులకు చెల్లించాల్సిన రూ.22 వేల కోట్ల బకాయిల చెల్లింపుల కోసం ప్రభుత్వం ఎటువంటి ఉత్తర్వులు ఇవ్వకుండా కేవలం మినిట్స్ విడుదల చేసిందని, మధ్యంతర భృతి చెల్లించకుండానే పీఆర్‌సీ అమలు చేస్తామనడం బూటకమని అన్నారు. సెప్టెంబరు 2004 కంటే ముందు నియామకం పొందిన ఉద్యోగులకు పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయకుండా ప్రభుత్వం దాటవేస్తోందని మండిపడ్డారు. కాంట్రాక్టు సిబ్బందిని రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. నాయకులు, ఉపాధ్యాయులు, ఉద్యోగులు, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ కార్యాలయం ప్రారంభం

వెలుగోడు, ఫిబ్రవరి 25: వెలుగోడు మండలంలోని గుంతకందాల గ్రామంలో టీడీపీ కార్యలయాన్ని టీడీపీ గ్రామ అధ్యక్షుడు వెంకటరమణ ఆధ్వర్యంలో ఆదివారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ టీడీపీ బలోపేతానికి కృషి చేస్తామన్నారు. నాయకులు గాండ్ల శివన్న, చిమ్మెశ్రీను, పాపయ్య, దర్గయ్య, ఈశక్, రాజు, మౌళాలి, మస్తాన్, చంద్రశేఖర్, రాముశెట్టి, రమణగౌడ్, ఉసేన్‌షా తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



గురువులతో పూర్వ విద్యార్థులు

నంద్యాల (నూనెపల్లె), ఫిబ్రవరి 25: నంద్యాలలోని సంజీవనగర్‌లో ఉన్న రామకృష్ణ విద్యాలయం 1978 ఎస్ఎస్‌సీ బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం పాఠశాలలో జరిగింది. 46 సంవత్సరాల తరువాత పూర్వ విద్యార్థులు చదువుకున్న పాఠశాలలో ఒకే వేదికపై కలుసుకొని ఆనందాన్ని పంచుకున్నారు. డాక్టర్ రవికృష్ణ, గెలివి రామకృష్ణా, పాణ్యం ప్రభాకర్‌రెడ్డి, కృష్ణమూర్తి, ఇసనకర్ర సత్యనారాయణ, లగిశెట్టి సురేష్, తదితరుల ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. 1978 బ్యాచ్‌కు చెందిన దివంగత స్నేహితులు 24 మంది చిత్రపటాల వద్ద నివాళి అర్పించారు. అనంతరం సంజీవనగర్‌లోని రామాలయం సమావేశ భవనంలో కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. కరస్పాండెంట్ నివర్తి మోహన్‌కుమార్, నరసింహారావు, మల్లికార్జునుడు, శ్రీరాములు, ఆంజనేయులు, తదితర ఉపాధ్యాయ బృందానికి సన్మానం చేశారు. పాఠశాల కరస్పాండెంట్ నివర్తి మోహన్‌కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'పాదయాత్ర భక్తులకు మెరుగైన సౌకర్యాలు'

శ్రీశైలం, ఫిబ్రవరి 25: పాదయాత్ర భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తున్నట్లు ఈవో పెద్దిరాజు తెలిపారు. శ్రీశైలం మహాక్షేత్రంలో మార్చి 1 నుంచి 11 వరకు మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల నేపథ్యంలో పాదయాత్ర భక్తులకు మెరుగైన సౌకర్యాల కల్పనలో భాగంగా వెంకటాపురం, నాగలూటి, దామర్లకుంట, పెద్దచెరువు, మఠంబావి, భీమునికొలను, కైలాసద్వారం అటవీ ప్రాంతాలలో తగు ఏర్పాట్లను పరిశీలించారు. వైద్యం, మంచినీరు, శౌచాలయాలు, చలువపందిర్లు గత సంత్సరం కంటే 20 శాతం ఎక్కువగా ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులను ఈవో ఆదేశించారు. అలాగే అటవీ అధికారుల సహకారంతో జంగిల్ క్లియరెన్స్ పనులు త్వరగా పూర్తి చేయాలన్నారు. నాగులూటి వద్ద మంచనీటి కోనేరును శుభ్రపరిచాలని ఆదేశించారు. కాలిబాటగా వచ్చే భక్తులకు ఆరోగ్య సమస్యలు ఎదురైనప్పుడు మెరుగైన వైద్యసేవలు అందించేందుకు వైద్యశిబిరాలను ఏర్పాటు చేయాలని, అవసరమైన ఔషధాలను అందుబాటులో ఉంచేందుకు చర్యలు చేపట్టాలని దేవస్థానం వైద్య విభాగాన్ని ఆదేశించారు. అటవీశాఖ, దేవస్థానం ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

'తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు'

ఆత్మకూరు, ఫిబ్రవరి 25: ఆత్మకూరు మున్సిపాలిటీ పరిధిలో తాగునీటి ఎద్దడి నివారణకు అన్ని విధాలుగా చర్యలు చేపట్టినట్లు మున్సిపల్ కమిషనర్ హరిప్రసాద్, కోఆప్షన్ సభ్యులు ఎంఎ రషీద్ పేర్కొన్నారు. ఈమేరకు ఆదివారం పట్టణంలోని కాలనీల్లో మరమ్మత్తులకు గురైన చేతి పంపులు, బోరుబావులతో పాటు కొత్తగా వేయనున్న బోర్ల ప్రదేశాన్ని వారు పరిశీలించారు. ఇంజనీరింగ్ విభాగం ఏఈ బాషా తదితరులు ఉన్నారు.

ఎస్టీయూ రాష్ట్ర కార్యవర్గంలో జిల్లా ఉపాధ్యాయులు

నంద్యాల (నూనెపల్లె), ఫిబ్రవరి 25: ఎస్టీయూ రాష్ట్ర కార్యవర్గంలో నంద్యాల జిల్లాకు చెందిన ఎస్టీయూ నాయకులకు చోటు లభించిందని ఆ యూనియన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మౌలాలి, ఆజామ్‌బేగ్ ఆదివారం తెలిపారు. ఎస్టీయూ 77వ రాష్ట్ర కౌన్సిల్ సమావేశంలో పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో జరిగిన సమావేశంలో నంద్యాల జిల్లా నుంచి ఎస్టీయు సీనియర్ నాయకులు శివశంకర్, రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శిగా ఎన్నికయ్యారని చెప్పారు. గతంలో కార్యవర్గ సభ్యులుగా పని చేసిన ఈవీ గోపాలకృష్ణ, ఇక్బాల్‌ను యథావిధిగా కొనసాగిస్తూ సంఘం అనుమతిని ఇచ్చిందని చెప్పారు. రాష్ట్ర కార్యవర్గంలో నంద్యాల జిల్లా ఎస్టీయూ నాయకులకు చోటు దక్కడంపై సంఘం రాష్ట్ర సీనియర్ నాయకుడు చంద్రశేఖర్, శ్రీనివాసులు, జీవీ ప్రసాద్‌రెడ్డి, తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

జగన్ పాలనలో వ్యవస్థలన్నీ నాశనం

● నంద్యాల డీసీసీ అధ్యక్షుడు లక్ష్మీనరసింహ యాదవ్



మాట్లాడుతున్న లక్ష్మీనరసింహ యాదవ్

నంద్యాల టౌన్, ఫిబ్రవరి 25: జగన్ పాలనలో రాష్ట్రంలోని అన్ని వ్యవస్థలు సర్వనాశనం అయ్యాయని నంద్యాల డీసీసీ అధ్యక్షుడు జె.లక్ష్మీనరసింహ యాదవ్ ధ్వజమెత్తారు. అనంతపురంలో ఈనెల 26న జరగబోయే రాష్ట్ర పునర్నిర్మాణ సభను విజయవంతం చేయాలని ఆదివారం డీసీసీ కార్యాలయంలో సన్నాహక ప్రతినిదులు సమావేశాన్ని నిర్వహించారు. లక్ష్మీనరసింహ యాదవ్ మాట్లాడుతూ జగన్ పాలనలో సంక్షేమం మొత్తం అట్టడుగు స్థాయికి చేరిందని ధ్వజమెత్తారు. సంక్షేమ పథకాల పేరుతో ప్రజలకు గోరంత ఇచ్చి, ధరలు పెంచి కొండత లాక్కుంటున్నారని అన్నారు. 8 సార్లు విద్యుత్ చార్జీలు, మూడు సార్లు ఆర్టీసీ చార్జీలు పెంచి, మదం, ఇసుక దందాలు నడుపుతూ, పెట్రోల్, డీజిల్, నిత్యావసర ధరలు పెంచి సామాన్యుల నడ్డి విరిచారన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

కుటుంబ సభ్యులకు అప్పగింత

కొత్తపల్లి, ఫిబ్రవరి 25: మతిస్థిమితం లేని వ్యక్తిని ఆ వ్యక్తి కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు ఎస్ఐ హరిప్రసాద్ ఆదివారం తెలిపారు. ఎస్ఐ తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. తెలంగాణ రాష్ట్రం తాండూరు మండలం, అచ్చుతాపురం గ్రామానికి చెందిన గోరప్ప అనే వ్యక్తి కొద్దికాలం క్రితం నుంచి మతిస్థిమితం సరిగ్గాలేక ఇబ్బంది పడుతున్నారు. గత ఐదు రోజుల క్రితం ఇంటి నుంచి బయటకు వచ్చారు. అక్కడి నుంచి సోమలశిల చేరుకుని కృష్ణానది ఇవతలి వైపునకు సంగమేశ్వరం వచ్చారని చెప్పారు. అక్కడి నుంచి శనివారం రాత్రి మండలంలోని ఎర్రమఠం గ్రామంలో రాత్రి సమయంలో అనుమానాస్పదస్థితిలో తిరుగుతున్నారని వివరించారు. ఈ విషయాన్ని గ్రామస్థులు పోలీసులకు సమాచారం ఇచ్చారని తెలిపారు. పోలిసు సిబ్బందిని అక్కడకు పంపి అతని స్టేషన్‌కు పిలిపించి సమచారం కనుక్కొని ఆదివారం ఆయన భార్యను పిలిపించి కుటుంబానికి అప్పగించామని చెప్పారు.

ప్రశాంతంగా గ్రూప్-2 పరీక్ష



శాంతిరాం ఇంజనీరింగ్ కళాశాల వద్ద అభ్యర్థులు

పాణ్యం, ఫిబ్రవరి 25: గ్రూప్-2 పరీక్ష ఆదివారం ప్రశాంతంగా జరిగాయి. మండలంలోని ఆర్జీఎం ఇంజనీరింగ్, శాంతిరాం ఇంజనీరింగ్, శాంతిరాం ఫార్మసీ కళాశాలల్లో పరీక్షలు జరిగాయి. పరీక్షలను నంద్యాల డీపీవో మంజులావాణి, తహసీల్దారు రామకృష్ణారెడ్డి, డీటీ మల్లికార్జునరెడ్డి పర్యవేక్షించారు. పరీక్షలకు ఎటువంటి అంతరాయం జరగకుండా పాణ్యం సీఐ నల్లప్ప ఆధ్వర్యంలో ఎస్ఐలు అశోక్, వెంకటసుబ్బయ్య, పోలీసు సిబ్బంది బందోబస్తు ఏర్పాటు చేశారు.

'ఎస్సీల సంక్షేమానికి ప్రాధాన్యం'

నంద్యాల (కల్చరల్), ఫిబ్రవరి 25: రాష్ట్రంలో ఎస్సీల అభివృద్ధికి, సంక్షేమానికి కేంద్రంలోని మోదీ ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని బీజేపీ నంద్యాల నియోజకవర్గ కన్వీనర్ అభిరుచి మధు చెప్పారు. నంద్యాల జిల్లా కేంద్రంలో ఆదివారం అభిరుచి మధు ఆధ్వర్యంలో దళిత రచ్చబండ కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. కార్యక్రమంలో ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షులు భరణి రమేష్, లింగన్న, సంజీవుడు, బాలన్న, శ్రీరామలు, మహిళా మోర్చా నాయకురాలు చెన్నమ్మ తదితరలు పాల్గొన్నారు. అనంతరం ప్రజా పోరు యాత్రలో భాగంగా ఆదివారం నందమూరి నగర్, వైయస్ నగర్ తదితర ప్రాంతాలలో పర్యటించారు.

నంద్యాల రూరల్: మండలంలోని మునగాల, రామయల్పురం, పులిమద్ది, నందమూరి నగర్, వైఎస్సార్ నగర్ తదీతర ప్రాంతాలలో ఆదివారం బీజేపీ ప్రజా పోరు యాత్ర సాగింది. బీజేపీ నంద్యాల కన్వీనర్ అభిరుచి మధు వైసీపీ ప్రభుత్వ తీరును ఎండగట్టారు. కేంద్ర పథకాలు, నిధులకు వైసీపి ప్రభుత్వం తన సొంత పేర్లతో ప్రచారం చేసుకుంటోందని ధ్వజమెత్తారు. నాయకులు డా. ఇంటి ఆదినారాయణ, అరవింద రెడ్డి, తూము శివారెడ్డి, రమణా రెడ్డి, ఉపేంద్రా రెడ్డి, లక్ష్మీరెడ్డి పాల్గొన్నారు.

మల్లన్న సన్నిధిలో తమిళనాడు పీఠాధిపతి

శ్రీశైలం, ఫిబ్రవరి 25: శ్రీశైలం భ్రమరాంబ మల్లికార్జున స్వామి, అమ్మవార్లను ఆదివారం తమిళనాడు మయిలడుతురైకు చెందిన ధర్మపురం ఆధీన పీఠాధిపతి పరమాచార్య స్వామిగల్ దర్శించుకున్నారు. స్వామి, అమ్మవార్ల దర్శనానంతరం పీఠాధిపతికి ఆలయ అధికారులు స్వామి శేష వస్త్రాలు, లడ్డూ ప్రసాదాలను అందజేశారు.

'ఉర్దూ ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయాలి'

గడివేముల, ఫిబ్రవరి 25: ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయాలని రాష్ట్ర ఉర్దూ టీచర్స్ అసోషియేట్ ప్రెసిడెంట్ సయ్యద్ అబ్దుల్‌రఖీబ్ అన్నారు. ఆదివారం ఆయన పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు.

'వైసీపీ పాలనలో రాష్ట్రం సర్వ నాశనం'



ముష్టెపల్లి గ్రామంలో వైసీపీ ప్రజా వ్యతిరేక విధానాల గురించి వివరిస్తున్న బీజేపీ శ్రీశైలం కన్వీనర్ మోమిన్ షబానా

ఆత్మకూరు రూరల్, ఫిబ్రవరి 25: వైసీపీ పాలనలో రాష్ట్రం సర్వనాశనమైందని బీజేపీ శ్రీశైలం నియోజకవర్గ కన్వీనర్ మోమిన్ షబానా ఆరోపించారు. ఆదివారం ఇందిరేశ్వరం, శ్రీపతిరావుపేట, ముష్టపల్లి గ్రామాల్లో ప్రజా పోరు యాత్రలో భాగంగా వైసీపీ ప్రభుత్వం చేపడుతున్న ప్రజా వ్యతిరేక కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో నాయకులు మౌలిబాషా, చింతా నాగేశ్వరరావు, ప్రతాప్ ఆచారి, రాజశేఖర్, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

నేటి పోలీసు స్పందన రద్దు

నంద్యాల క్రైం, ఫిబ్రవరి 25: ప్రతి సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించే స్పందన కార్యక్రమాన్ని నేడు తాత్కాలికంగా రద్దు చేసినట్లు ఎస్పీ కె.రఘువీర్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు ఈ విషయాన్ని గుర్తుంచుకోవాలని సూచించారు. జిల్లా కేంద్రంలోని ఎస్పీ కార్యాలయంలో నిర్వహించే స్పందన కార్యక్రమాన్ని మాత్రమే తాత్కాలికంగా రద్దు చేశామని, జిల్లాలోని ఆయా సబ్ డివిజన్, సర్కిల్ కార్యాలయాలు, అన్ని పోలీస్ స్టేషన్లలో యథావిధిగా సోమవారం స్పందన కార్యక్రమం ఉంటుందని చెప్పారు.

నేడు కలెక్టరేట్‌లో స్పందన

నంద్యాల (కల్చరల్), ఫిబ్రవరి 25: ప్రజలనుంచి ఫిర్యాదులను స్వీకరించి వాటిని పరిష్కరించేందుకు ఈనెల 26న కలెక్టరేట్‌లో జగనన్నకు చెబుదాం - స్పందన కార్యక్రమం ఉంటుందని కలెక్టర్ డాక్టర్ కె. శ్రీనివాసులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9.30 గంటలకంతా జిల్లా అధికారులందరూ హాజరు కావాలని ఆదేశించారు. జిల్లా కేంద్రంతో పాటు మండల, నియోజకవర్గ, డివిజన్ స్థాయిలో కూడా యధాతథంగా స్పందన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు.

విగ్రహ ప్రతిష్ఠ పూజలు ప్రారంభం



లక్ష్మాపురంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న భక్తులు

పగిడ్యాల, ఫిబ్రవరి 25: మండలంలోని లక్ష్మాపురం గ్రామంలోని లక్ష్మీచెన్నకేశవ, ఆంజనేయ స్వామి విగ్రహ, ధ్వజ శిఖర ప్రతిష్ఠ మహోత్సవ పూజలు ఆదివారం ప్రారంభమయ్యాయి. ప్రతిష్ఠ మహోత్సవాన్ని కార్యక్రమాన్ని ఈ నెల 29న నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ నిర్వాహకులు తెలిపారు. అందులో భాగంగా ఆదివారం ఉదయం నుంచి ఆలయంలో పురోహితులు బాలకృష్ణ శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గోపూజ, గణపతి పూజ, యాగశాల ప్రవేశం తదితర పూజలు నిర్వహించారు. ఈ వేడుకలు ఐదు రోజుల పాటు నిర్వహించనున్నారు.

కొత్తూరులో ప్రముఖుల పూజలు

పాణ్యం, ఫిబ్రవరి 25: మండలంలోని కొత్తూరు సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి ఆదివారం ప్రముఖులు పూజలు నిర్వహించారు. నంద్యాల ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, మంత్రాలయం ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి కుటుంబ సమేతంగా పూజలు నిర్వహించారు. ఆలయ ఈవో రామకృష్ణ వారికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి వారితో ప్రత్యేక పూజలు చేయించారు. అనంతరం వారిని ఘనంగా సత్కరించి తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది సుబ్బారెడ్డి, అర్చకులు నారాయణ స్వామి, సురేష్ శర్మ, సిబ్బంది పాల్గొన్నారు.

హిందూ ధర్మం ఎంతో గొప్పది

● కంచికామ కోటి పీఠాధిపతి శంకర విజయేంద్ర సరస్వతి స్వామి



ప్రసంగిస్తున్న జగద్గురు కంచికామ కోటి పీఠాధిపతి

మహానంది, ఫిబ్రవరి 25: హిందూ ధర్మం ఎంతో గొప్పదని, ధర్మాన్ని పోషించడానికే క్షేత్రాలు వెలిసాయని జగద్గురు కంచికామ కోటి పీఠాధిపతి శంకర విజయేంద్ర సరస్వతి స్వామి అన్నారు. రాయలసీమ పర్యటనలో భాగంగా ఆదివారం పీఠాధిపతి మహానంది క్షేత్రానికి వచ్చారు. ఆలయం ప్రాంగణంలోని అభిషేక మంటపంలో ఉదయం శిష్య బృందంతో పూజలు నిర్వహించారు. రాత్రి ఆలయం ప్రాంగణంలోని పోచా విశ్రాంతి భవనంలో భక్తులకు అనుగ్రహ భాషణం ప్రసంగం చేశారు. తల్లితండ్రులు చిన్నతనంలోనే చిన్నారులకు హిందు ధర్మం గురించి వివరించాలని తెలిపారు. దేవాలయాల్లో ధర్మ ప్రచారం ముఖ్యమని చెప్పారు. మహానందిలో సోమవారం నిశ్చితార్థమంటపానికి పీఠాధిపతి భూమి పూజ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, నంద్యాల జిల్లా ఎస్పీ రఘువీర్‌రెడ్డి, ఆలయ ఈవో కాపు చంద్రశేఖర్‌రెడ్డి, దేవస్థానం నిత్యాన్నదాన సత్రం కూరగాయల దాత లక్కబోయిన ప్రసాద్, ఆదిలక్ష్మమ్మ దంపతులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

నేడు నంద్యాలకు రాక

నంద్యాల (కల్చరల్): నంద్యాల ప్రథమ నందీశ్వరాలయం పక్కన వెలసిన గాయత్రీ దేవాలయానికి సోమవారం సాయంత్రం 4 గంటలకు కంచి కామకోటి పీఠం స్వామి జగద్గురు శంకర విజయేంద్ర సరస్వతి వస్తున్నట్లు బ్రాహ్మణ సేవా సమాఖ్య అధ్యక్షుడు కరణం మురళీకృష్ణారావు తెలిపారు. కావున భక్తులు అందరూ వచ్చి స్వామి వారిని దర్శనం చేసుకొని ఆశీర్వాదములు అందుకోవాలన్నారు.

వైభవంగా పల్లకీ ఉత్సవం

శ్రీశైలం, ఫిబ్రవరి 25: శ్రీశైల మహాక్షేత్రంలో లోకకల్యాణార్థం ఆదివారం స్వామి, అమ్మవార్లకు పల్లకీ ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని ఆశీర్వచన మండపంలో నిర్వహించిన ఉత్సవ కార్యక్రమం నిర్విఘ్నంగా జరగాలని మహాగణపతికి ప్రత్యేక పూజలు చేశారు. తరువాత స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులకు శాస్త్రోక్తంగా షోడశోపచార పూజలు నిర్వహించి పల్లకీలో ఆసీనులనుజేసి ఆలమ్మవారి ఆలయ ప్రాంగణంలో ఉత్సవాన్ని నిర్వహించారు.

బంగారు పళ్లెం బహూకరణ



ఈవో పెద్దిరాజుకు బంగారు పళ్లెంను అందజేస్తున్న భక్తుడు

శ్రీశైలం, ఫిబ్రవరి 25: శ్రీశైలం దేవస్థానానికి ఆదివారం చెన్నైకి చెందిన కోనేరు విమలాదేవి కుటుంబ సభ్యులతో కలిసి 343 గ్రాముల బంగారు పళ్లెంను బహూకరించారు. స్వామి, అమ్మవార్ల కైంకర్యాలలో వినియోగించేందుకు ఈ బంగారు పళ్లెంను అందజేసినట్లు భక్తులు తెలిపారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని ఆశీర్వచన మండపంలో ఆలయ కార్యనిర్వహణాధికారి డి. పెద్దిరాజుకు ఈ పళ్లెంను అందజేశారు. దాతకు స్వామి, అమ్మవార్ల శేష వస్త్రాలు, ప్రసాదాలు, స్వామి, అమ్మవార్ల జ్ఞాపికను అందజేసి సత్కరించారు. ఆలయ సహాయ కార్యనిర్వహణాధికారి హరిదాసు, అమ్మవారి ఆలయ ప్రధానార్చకులు మార్కండేయశాస్త్రి, వేదపండితులు గంటి రాధాకృష్ణశర్మ, పర్యవేక్షకులు పాల్గొన్నారు. అలాగే భక్తుల సౌకర్యార్థం నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి గుంటూరుకు చెందిన జొన్నలగడ్డ శ్రీకాంత్ రూ. లక్ష విరాళాన్ని, ప్రాణదాన ట్రస్టుకు చెన్నైకి చెందిన కోనేరు మదు రూ. లక్ష విరాళాన్ని దేవస్థానం అధికారులకు అందజేశారు.

'పాత్రికేయులపై దాడులు అమానుషం'

పాణ్యం, ఫిబ్రవరి 25: పాత్రికేయులు, కార్యాలయాలపై దాడులు చేయడం అమానుషమని దళిత ప్రజా సంఘాల నాయకుడు బాలస్వామి అన్నారు. ఆదివారం పాణ్యంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ అక్రమార్కులపై వార్తలు రాసినపుడు వాటిని నిరూపించుకోవాలే తప్ప దాడులకు దిగడం సమంజం కాదన్నారు. కార్యక్రమంలో మాలమహానాడు నాయకులు దేవదత్తు పాల్గొన్నారు.

కోట్ల విజయానికి కృషి చేద్దాం


మాట్లాడుతున్న సర్పంచ్ శ్రీనివాస్ యాదవ్

బేతంచెర్ల, ఫిబ్రవరి 25: డోన్‌లో కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి విజయానికి టీడీపీ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని అంబాపురం సర్పంచ్ శ్రీనివాస్ యాదవ్, ఎరుకల చెరువు శివలు అన్నారు. ఆదివారం నంద్యాల రోడ్డులోని ఆంజనేయస్వామి దేవాలయం పక్కన ఉన్న ఫంక్షన్ హాలులో టీడీపీ నాయకుల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ పార్టీలో భేదాభిప్రాయాలు లేకుండా కోట్ల విజయానికి కృషి చేయాలన్నారు. సమావేశంలో జిల్లా టీడీపీ ఉపాధ్యక్షుడు పోలూరు వెంకటేశ్వరరెడ్డి, టీడీపీ సీనియర్ నాయకులు మాజీ జడ్పీటీసీ సభ్యురాలు బుగ్గన ప్రసన్నలక్ష్మి, పోలూరు రాఘవరెడ్డి, టీడీపీ మండల కన్వీనర్ ఎల్ల నాగయ్య, బుగ్గన బ్రహ్మానందరెడ్డి, భీమేశ్వరరెడ్డి, డోన్ అడ్వకేట్ సుధాకర్ రెడ్డి, శ్రీనివాసభట్లు, రాఘవరెడ్డి, బేతంచెర్ల మాజీ ఎంపీటీసీ జాకీరుల్లాభేగ్, హెచ్.కొట్టాల రఘు, బీసీ సెల్ పట్టణ అధ్యక్షులు టైలర్ రాముడు, వార్డు కౌన్సిలర్లు రామాంజనేయులు, పుట్టపాశం వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

రాష్ట్రంలో అసమర్థ పాలన: జనసేన


మాట్లాడుతున్న ఆలా మోహన్ రెడ్డి

డోన్(రూరల్), ఫిబ్రవరి 25: రాష్ట్రంలో అసమర్థ పాలన నడుస్తుందని జనసేన నియోజకవర్గ నాయకులు ఆలా మోహన్ రెడ్డి అన్నారు. ఆదివారం జనసేన పార్టీ కార్యాలయంలో మాట్లాడుతూ నియోజకవర్గంలోని గ్రామాల్లో టీడీపీ అభ్యర్థి కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి విజయానికి జనసేన నాయకులు, టీడీపీ నాయకులు కలిసికట్టుగా పని చేస్తామన్నారు. కార్యక్రమంలో జనసేన నాయకులు పరదేశి మహేష్, పులిశెట్టి రాయల్ మల్లికార్జున, గణేష్, భాస్కర్, రామాంజి పాల్గొన్నారు.

బీసీ సంఘం గౌరవ అధ్యక్షుడి మృతి

చాగలమర్రి, ఫిబ్రవరి 25: చాగలమర్రి మండల బీసీ సంక్షేమ సంఘం గౌరవ అధ్యక్షుడు కృష్ణయ్య (75) అనారోగ్యంతో ఆదివారం మృతి చెందారు. టీడీపీ నాయకులు అన్సర్‌బాషా, నల్లా నాగరాజు, గుత్తి నరసింహులు, బీసీ సంఘం, సీమాంధ్ర బీసీ సంక్షేమ సంఘం, దూదేకుల నూర్‌బాషా సంఘం నాయకులు నివాళి అర్పించారు.

కేసు నమోదు

కొలిమిగుండ్ల, ఫిబ్రవరి 25: కొలిమిగుండ్ల మండలం మదనంతాపురం గ్రామానికి చెందిన కొట్టే శివ శంకర్‌రెడ్డి అరటి తోటలోకి, అదే గ్రామానికి చెందిన పల్లె ప్రమీల, ముక్క వెంకట్‌నాథ్‌రెడ్డిలు అక్రమంగా ప్రవేశించి సుమారు 250 అరటి చెట్లను నరికివేశారని, అడ్డుపడ్డా తనను ప్రమీల చేతితో చెంపపై కొట్టిందని బాధితుడు కొట్టే శివశంకర్ రెడ్డి ఫిర్యాదు చేశాడని సీఐ గోపీనాథ్‌రెడ్డి తెలిపారు. ప్రమీల, ముక్క వెంకట్‌నాథ్ రెడ్డిలపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

నేడు వాహనాల వేలం

నంద్యాల, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): ఆళ్లగడ్డ సబ్ డివిజన్ పరిధిలో మద్యం కేసులలో పట్టుబడిన వాహనాలను సోమవారం ఆళ్లగడ్డ రూరల్ పోలీస్ స్టేషన్ ఆవరణలో వేలం వేస్తున్నట్లు ఎస్‌ఐ నరసింహులు ఆదివారం తెలిపారు. ఈ వేలం పాటల్లో ఒక కారు, మూడు మోటార్ సైకిళ్లను వేలం వేస్తున్నామని తెలిపారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

బేతంచెర్ల, ఫిబ్రవరి 25: మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 7 మంది బాధితులకు వైద్య చికిత్సల నిమిత్తం మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ కింద రూ.11.46 లక్షల చెక్కులను మండల ఎంపీపీ నాగభూషణం రెడ్డి నాయకులు ఆదివారం పంపిణీ చేశారు కార్యక్రమంలో ఎంపీపీ నాగభూషణం రెడ్డి, మున్సిపల్ చైర్మన్ సీహెచ్ చలంరెడ్డి, కౌన్సిలర్ జశ్వంత్ రెడ్డి, మండల కన్వీనర్ తిరుమలేశ్వరరెడ్డి, సచివాలయాల టౌన్ కన్వీనర్ డక్కి శేఖర్, మాజీ సర్పంచ్ సుధాకరప్ప, గోపాల్ రెడ్డి పాల్గొన్నారు.

రేవంత్ కుమార్‌కు డాక్టరేట్

బేతంచెర్ల, ఫిబ్రవరి 25: పట్టణానికి చెందిన ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కందగడ్డల మోహన్‌రావు కుమారుడు రేవంత్ కుమార్ బాంబే ఐఐటీలో జరిగిన 62వ పట్టభద్రుల సమావేశం సివిల్ విభాగంలో పీహెచ్‌డీ పూర్తి చేసి డాక్టరేట్ అందుకున్నారు. న్యూయార్క్ విశ్వవిద్యాలయానికి చెందిన ప్రొఫెసర్ సతీష్ కె.త్రిపాటి ముఖ్య అతిథిగా హాజరై డాక్టరేట్‌ను ప్రదానం చేశారు.

'ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలి'

చాగలమర్రి, ఫిబ్రవరి 25: రాష్ట్రంలో ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని ఎస్టీయూ రాష్ట్ర అదనపు కార్యదర్శి శివశంకర్, మండల అధ్యక్షుడు మస్తాన్‌వలి కోరారు. ఆదివారం ఎస్టీయూ కార్యాలయంలో వారు మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయుల పెండింగ్ బకాయిలను తక్షణమే చెల్లించాలని కోరారు. బ్యాంకుల్లో తీసుకున్న రుణాలు సకాలంలో చెల్లించలేక ఇబ్బందులు పడుతున్నామన్నారు. సీపీఎస్ విధానం రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని కోరారు. ఉద్యోగ, ఉపాధ్యాయులపై కక్షసాధింపు ధోరణి విడనాడాలని, ప్రతి నెల 1వ తేదీన జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్టీయూ నాయకులు పాల్గొన్నారు.

టీడీపీ బలోపేతానికి కృషి చేయాలి

మాజీ మంత్రి భూమా అఖిలప్రియ


రాంపల్లెలో అఖిలప్రియ సమక్షంలో టీడీపీలో చేరిన వైసీపీ నాయకులు

నంద్యాల, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): టీడీపీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని మాజీ మంత్రి భూమా అఖిలప్రియ కోరారు. ఆళ్లగడ్డ పట్టణంలోని గాయత్రి వీధిలో ఆదివారం బాబు ష్యూరిటీ.. భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. వీధిలోని అన్ని కుటుంబాల వారిని కలిసి రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వంతో ఎదుర్కొంటున్న కష్టాలను, నష్టాలను వివరించారు. వైసీపీ ప్రభుత్వం ఏపీని రాజధాని లేని రాష్ట్రంగా మార్చిందని అన్నారు. వైసీపీకి ప్రజలే తగిన గుణపాఠం చెబతారన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ హుసేన్‌బాషా, మహిళలు నూర్జహాన్, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

చాగలమర్రి: రాష్ట్రంలో వైసీపీ అరాచక పాలనకు చరమగీతం పాడాలని మాజీ మంత్రి భూమా అఖిలప్రియ ప్రజలకు పిలుపునిచ్చారు. మండలంలోని రాంపల్లె గ్రామంలో ఆదివారం వైసీపీ నాయకులు రామకృష్ణారెడ్డి, ప్రసాద్‌రెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, కోటిరెడ్డి, వెంకట్రామిరెడ్డి, బయ్యపురెడ్డి, జయరామిరెడ్డి, అంకాల్‌రెడ్డి, శివారెడ్డితో పాటు మరో 11 కుటుంబాలు వైసీపీ నుంచి టీడీపీలోకి చేరాయి. వీరికి అఖిలప్రియ పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ నరసింహారెడ్డి, టీడీపీ మైనార్టీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అన్సర్‌బాషా, లక్ష్మీరెడ్డి, శివారెడ్డి, భూషణం, పక్రుద్దీన్, మాజీ సర్పంచ్‌లు పరమేశ్వరమ్మ, పుల్లయ్య, దూదేకుల బాషా, బుజ్జి, శెట్టన్న, బ్రహ్మానందరెడ్డి, శేఖర్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి, సూర్యనారాయణ, రమణారెడ్డి పాల్గొన్నారు.

శిరివెళ్ల: దివంగత నాయకులు, తల్లిదండ్రులు భూమా నాగిరెడ్డి, భూమా శోభానాగిరెడ్డి ఇచ్చిన బాధ్యతకు కట్టుబడి ఉన్నామని మాజీ మంత్రి భూమా అఖిలప్రియ అన్నారు. ఆళ్లగడ్డ నియోజకవర్గంలోని ప్రజలకు, భూమా అభిమానులకు ఎళ్లవేళలా అండగా ఉండి వారికి సేవలందించడమే ధ్యేయమని అన్నారు. బాబు ష్యూరిటీ.. భవిష్యత్తుకు గ్యారెంటీలో భాగంగా మండలంలోని జీనేపల్లె గ్రామంలో ఇంటింటికి తిరుగుతూ ఆదివారం కరపత్రాలు పంపిణీ చేశారు. నాయకులు భార్గవ్ రామ్ నాయుడు, భూమా జగత్ విఖ్యాత్‌రెడ్డి, మండల కన్వీనర్ కాటంరెడ్డి శ్రీకాంత్‌రెడ్డి, కుందూరు మోహన్‌రెడ్డి, మురళి, సూరా రామ, ప్రతాప్‌రెడ్డి, షేక్ హుసేన్ బాషా, కమతం పుల్లారెడ్డి, లక్ష్మీరెడ్డి, సత్తారు లక్ష్మీరెడ్డి, బీసీ ఫిదా హుసేన్, జికిరియా పాల్గొన్నారు.

పెద్దమ్మను దర్శించుకున్న అఖిలప్రియ

దొర్నిపాడు: మండలంలోని డబ్ల్యూ గోవిందిన్నెలో వెలసిన పెద్దమ్మను భూమా అఖిలప్రియ ఆదివారం పూజలు నిర్వహించారు. అర్చకులు తీర్థ ప్రసాదాలు అందజేసి ఆశీర్వచనాలు పలికారు. మాజీ ధర్మకర్త శివయ్య, ఉప సర్పంచ్ హరి, వాసు, అంజిబాబు, మధుసూదన్‌రెడ్డి, అబ్దుల్ రెహమాన్, వెంకటసుబ్బారెడ్డి, శంకరయ్య, తలారి చిన్న పెద్దన్న పాల్గొన్నారు.

టీడీపీ నాయకుల సంబరాలు


చాకరాజువేములలో సంబరాలు చేసుకుంటున్న టీడీపీ నాయకులు

దొర్నిపాడు, ఫిబ్రవరి 25: ఆళ్లగడ్డ ఎమ్మెల్యే అభ్యర్థిగా భూమా అఖిలప్రియను టీడీపీ అధిష్ఠానం ప్రకటించడంతో చాకరాజువేములలో టీడీపీ నాయకులు బాణసంచా కాల్చి సంబరాలు చేసుకున్నారు. టీడీపీ నాయకులు మల్లేశ్వరచౌదరి, లింగుట్ల వెంకట్‌నాయుడు, కొత్తపల్లి సురేంద్ర, చక్రవర్తి నాయుడు, సిద్ధి సత్యం, సిద్ధి నారాయణ, అమరసాని రవి, చలుంగారి అంకన్న యాదవ్, కాకర్ల కేశవనాయుడు, ఎండూరి గోపాల్‌నాయుడు, లింగుట్ల రమణయ్య, హబీబ్‌బాషా తదితరులు ఉన్నారు.

రైతుకు తీవ్ర గాయాలు

రుద్రవరం, ఫిబ్రవరి 25: మండలంలోని చిలకలూరు గ్రామానికి చెందిన షరీఫ్ అనే రైతు పశుగ్రాసం తరలిస్తుండగా ఆదివారం తీవ్రంగా గాయపడ్డారు. గ్రామ సమీపంలోని తన పంట పొలంలో ఉన్న జొన్న చొప్పను ఎడ్లబండికి లోడ్ చేసి గ్రామానికి తరలిస్తుండగా మార్గమధ్యంలో బండిపై ఉన్న కర్రలు తలపై పడడంతో తీవ్రంగా గాయపడ్డారు. చికిత్స నిమిత్తం 108 వాహనంలో నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

దివ్యాంగుడికి వీల్ చైర్ పంపిణీ

బనగానపల్లె, ఫిబ్రవరి 25: మానవతా స్వచ్ఛంద సంస్థ చైర్మన్ దొనపాటి యాగంటిరెడ్డి బనగానపల్లె పట్టణంలోని పింజరిపేటలోని దివ్యాంగుడు ఖాజాహుస్సేన్‌కు తన సొంత నిధులతో వీల్ చైర్ ఆదివారం పంపిణీ చేశారు. ఖాజాహుస్సేన్ కిడ్నీలు చెడిపోయి నడవలేనిస్థితిలో ఉండగా ఈవిషయాన్ని పూల అల్తాఫ్ అనే వ్యక్తి ఆయన దృష్టికి తీసుకెళ్లారు. స్పందించి వీల్ చెర్‌ను దివ్యాం గుడికి పంపిణీ చేశారు. యాగంటిరెడ్డి మాట్లాడుతూ దివ్యాంగులు ఎవరైనా ఉంటే వారికి తన సొంత నిధులతో వీల్ చైర్లు అందజేస్తానని తెలిపారు.


వీల్ చైర్ పంపిణీ చేస్తున్న యాగంటిరెడ్డి

పుట్టాలమ్మకు పూజలు

నంద్యాల, ఫిబ్రవరి 25(ఆంధ్రజ్యోతి): ఆళ్లగడ్డ మండలంలోని రామతీర్థం క్షేత్రంలో వెలసిన పుట్టాలమ్మ అమ్మవారికి భక్తులు ఆదివారం పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. అనంతరం భక్తులకు వేదపండితులు అన్నదానం చేశారు.

జ్వాలా లక్ష్మీనరసింహస్వామికి..

రుద్రవరం: నరసింహా.. గోవిందా.. అంటూ నామస్మరణతో పార్వేట పల్లకీలో కొలువుదీరిన జ్వాలా లక్ష్మీనరసింహస్వామి, ప్రహ్లాద వరద స్వాములకు ఆదివారం రుద్రవరంలో ప్రత్యేక పూజలు చేశారు. రుద్రవరంలోని చంద్రుడిపేట, పడమటి వీధుల్లో తెలుపుల వద్ద కొలువుదీరిన ఉత్సవ మూర్తులకు భారీ సంఖ్యలో తరలివచ్చి భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది.

లింగమయ్య స్వామికి..: మండలంలోని ముత్తులూరు గ్రామ సమీపంలో కొలువుదీరిన లింగమయ్య స్వామికి ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు అభిషేకం చేసి పూజలు ప్రారంభించారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు స్వామికి నైవేద్యం సమర్పించారు.


పుట్టాలమ్మ దర్శనానికి బారులు తీరిన భక్తులు

గ్రామదేవతలకు: మండలంలోని యల్లావత్తుల, రుద్రవరం, కొండమాయపల్లె గ్రామాల్లో గ్రామ దేవతలకు ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. పెద్దమ్మ, మారెమ్మ, సుంకులమ్మ, జంబుల పరమేశ్వరి అమ్మవార్లకు బోనాలు, చీరలు సమర్పించి మహిళలు ప్రత్యేక పూజలు చేశారు.

నేటి పోలీస్ స్పందన రద్దు

నంద్యాల క్రైం, ఫిబ్రవరి 25: ప్రతి సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించే స్పందన కార్యక్రమాన్ని నేడు తాత్కాలికంగా రద్దు చేసినట్లు ఎస్పీ కె.రఘువీర్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు ఈ విషయాన్ని గుర్తుంచుకోవాలని సూచించారు. జిల్లా కేంద్రంలోని ఎస్పీ కార్యాలయంలో నిర్వహించే స్పందన కార్యక్రమాన్ని మాత్రమే తాత్కాలికంగా రద్దు చేశామని, జిల్లాలోని ఆయా సబ్ డివిజన్, సర్కిల్ కార్యాలయాలు, అన్ని పోలీస్ స్టేషన్లలో యథావిధిగా సోమవారం స్పందన కార్యక్రమం ఉంటుందని చెప్పారు.

కమనీయం.. ఉమామహేశ్వర స్వామి కల్యాణం


స్వామి, అమ్మవార్లకు కల్యాణం చేస్తున్న వేద పండితులు

చాగలమర్రి, ఫిబ్రవరి 25: మండలంలోని డి.వనిపెంట గ్రామంలో పౌర్ణమి సందర్భంగా ఉమామహేశ్వర, రామలింగస్వామి కల్యాణోత్సవం, దీపోత్సవం, గ్రామోత్సవ కార్యక్రమాలను వైభవంగా నిర్వహించారు. వేద పండితుల ఆధ్వర్యంలో కలశ స్థాపన, రుద్రాభిషేకం, పూర్ణాహుతి హోమాలు చేశారు. ఉమామహేశ్వర ఉత్సవమూర్తులకు చిన్నారులు, మహిళలు భారీ ఎత్తున దీపాలు చేతపట్టి దీపోత్సవంతో ఘనంగా గ్రామోత్సవం నిర్వహించారు. భజన, కోలాట కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో శివస్వాములు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

డోన్‌లో ప్రజా పోరు యాత్ర ప్రారంభం


ప్రజా పోరు యాత్రను ప్రారంభిస్తున్న బీజేపీ నాయకులు

డోన్(రూరల్), ఫిబ్రవరి 25: డోన్ పట్టణం పాత బస్టాండు ప్రాంతంలో బీజేపీ ఆధ్వర్యంలో ఆదివారం ప్రజాపోరు యాత్ర ప్రారంభమైంది. ఈ యాత్రను బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ సందు వెంకటరమణ ప్రారంభించి మాట్లాడారు. కేంద్రం రాష్ట్రంలో అమలు చేసిన అనేక సంక్షేమ పథకాల గురించి వివరించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు, ప్రజాపోరు యాత్ర కో-కన్వీనర్ ఒంటెద్దు బండి కిరణ్, నాయకులు బొంకూరి రవికుమార్, బోయ బాలకృష్ణ, సుధాకర్, శివ, బి.మహేష్, కె.శ్రీనివాసులు, భాస్కర్, శ్రీకాంత్ నాయుడు పాల్గొన్నారు.

మల్లెవేములలో తాగునీటి కష్టాలు

● ట్యాంకర్లతో నీటి సరఫరా చేసిన టీడీపీ నాయకులు

చాగలమర్రి, ఫిబ్రవరి 25: మండలంలోని మల్లేవేముల గ్రామంలో ఎస్సీ కాలనీలో తాగునీటి కోసం అవస్థలు పడుతున్నారు. కొళాయిలకు నీరు రాకపోవడంతో ప్రజలు పొలాల బోర్ల వద్దకు వెళ్లి తెచ్చుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. కాలనీలో ఉన్న బోరు ద్వారా నీటి సరఫరా జరుగకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. ప్రజల అవస్థలు గమనించిన టీడీపీ నాయకులు నడిపి ఓబయ్య, నరసింహుడు, ఓబులేసు, నాగరాజు, ఓబన్న స్పందించి ట్యాంకర్ల ద్వారా ఎస్సీ కాలనీలో నీటి సరఫరా కల్పించారు. ట్యాంకర్ల వద్దకు వెళ్లి కాలనీ వాసులు బిందెలతో నీరు తెచ్చుకున్నారు.


ట్యాంకు వద్ద నీరు పట్టుకుంటున్న ప్రజలు

హిందూ ధర్మ సమ్మేళనం


శోభాయాత్రలో పాల్గొన్న లాయర్ మాధవరెడ్డి తదితరులు

బనగానపల్లె, ఫిబ్రవరి 25: బనగానపల్లె పట్టణంలో సమరసతసేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం హిందూ ధర్మ సమ్మేళనం నిర్వహించారు. ఉదయం ఆంజనేయస్వామి ఆలయం నుంచి శోభాయాత్ర, ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ హిందూమత గొప్పదనం, ఆధ్యాత్మిక చింతన గురించి వివరించారు. కార్యక్రమంలో జయదేవానంగిరి స్వామీజీ, జ్ఞానేశ్వరానందస్వామి, సురేంద్ర, ఈశ్వర్‌రెడ్డి, లాయర్ మాధవ రెడ్డి, నాగమోహన్‌రెడ్డి, దాసరి శ్రీనివాసులు, శివరామిరెడ్డి, శంకరయ్య, నాగ మల్లారెడ్డి, జగన్నాథరెడ్డి, విశ్వనాథరెడ్డి, ఓబుళరెడ్డి పాల్గొన్నారు.

ఉచిత మెగా వైద్య శిబిరం


రోగులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్

సంజామల, ఫిబ్రవరి 25: మంగపల్లెలోని పెద్దిరెడ్డి తిమ్మారెడ్డి ప్రజా వైద్యశాలలో ఆదివారం ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహించారు. కర్నూలు, నంద్యాల పట్టణానికి చెందిన వైద్యులు గుండె జబ్బులు, బీపీ, షుగర్ , ఎముకలు, చర్మ, దంత వ్యాధులకు సంబంధించి రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు నంద్యాల గురురాజ విద్యాసంస్థల అధినేత పెద్దిరెడ్డి దస్తగిరి రెడ్డి మాట్లాడుతూ తమ స్వగ్రామం అయిన మంగంపల్లెలో ప్రతి నెలా చివరి ఆదివారం సొంత నిధులతో వైద్య శిబిరం ఏర్పాటు చేస్తున్నామన్నారు.

టీడీపీ గెలుపే లక్ష్యంగా పని చేయాలి


మాట్లాడుతున్న సుబ్బయ్య

ప్యాపిలి, ఫిబ్రవరి 25: డోన్‌లో టీడీపీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు గండికోట రామసుబ్బయ్య అన్నారు. ఆదివారం మండలంలోని కలచట్ల గ్రామంలో ఆయన కార్యకర్తలతో మాట్లాడారు. త్వరలో ఎన్నికలు జరుగనున్నందున పార్టీ శ్రేణులు టీడీపీ మేనిఫెస్టోను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. కార్యక్రమంలో నాయకులు కలచట్ల ప్రసాద్, రామాంజి నేయులు తదితరులు పాల్గొన్నారు.

హెచ్ఐవీ నివారణపై అవగాహన సదస్సు


ప్రజలకు అవగాహన కల్పిస్తున్న కళా బృందం సభ్యులు

డోన్(రూరల్), ఫిబ్రవరి 25: పట్టణంలోని పాతబస్టాండులో ఆదివారం హెచ్ఐవీ నివారణపై అవగాహన సదస్సు నిర్వహించారు. హ్యాండ్స్ స్వచ్ఛంద సంస్థ, మంజుల కళాబృందం ఆధ్వర్యంలో హెచ్ఐవీ-ఎయిడ్స్, సుఖ వ్యాధులపై పాటలు, నాటికల రూపంలో ప్రజలకు అవగాహన కల్పించారు. హ్యాండ్స్ స్వచ్ఛంద సంస్థ, మంజుల కళాబృందం సభ్యులు సరస్వతి, షాజహాన్, సలీనా, లలిత, రాజేశ్వరి, బాషా పాల్గొన్నారు.

ఘనంగా షబ్ ఎ బరాత్


రుద్రవరంలో నమాజ్ చేస్తున్న ముస్లింలు

రుద్రవరం, ఫిబ్రవరి 25: మండలంలోని రుద్రవరం, నరసాపురం, ఆలమూరు, చిన్నకంబలూరు, కొండమాయపల్లె, తదితర గ్రామాల్లో ఆదివారం షబ్ ఎ బరాత్ నిర్వహించారు. ఈ సందర్భంగా ముస్లింలు ప్రత్యేక నమాజ్ చేశారు.

చాగలమర్రి: మండలంలోని ఆయా గ్రామాల్లో షబ్ ఎ బరాత్ పండుగను ముస్లింలు ఘనంగా జరుపుకున్నారు. ఆదివారం రాత్రి చాగలమర్రి గ్రామంలోని జామియా, అరబ్, నూరానీ, ఇసూబ్, కోటగడ్డ, పెద్దమకానం మసీదుల్లో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. రాత్రంతా మసీదుల్లో జాగరణ చేసి అల్లాను ప్రార్థించారు. ఆయా మసీదుల్లో పండుగ విశిష్టత గురించి మౌలానాలు, ప్రభుత్వ ఖాజీ యూనస్ తెలియజేశారు. మహిళలు కూడా గృహాల్లో జాగరణ చేస్తూ ప్రార్థనలు చేశారు.

'టీడీపీతోనే బీసీల సాధికారత'


మాట్లాడుతున్న లక్ష్మీనారాయణగౌడ్

చాగలమర్రి, ఫిబ్రవరి 25: టీడీపీతోనే బీసీల సాధికారత సాధ్యమని బీసీ సంఘం మండల అధ్యక్షుడు లక్ష్మీనారాయణగౌడ్ అన్నారు. ఆదివారం బీసీ సంఘం కార్యాలయం వద్ద జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ టీడీపీతోనే బీసీల సంక్షేమం సాధ్యమన్నారు.. టీడీపీ ప్రభుత్వంలో బీసీలకు ఆదరణ పనిముట్లు, కార్పొరేషన్‌ల ద్వార నిధులు మంజూరు చేశారని గుర్తుచేశారు. వైసీపీ అరాచక పాలనకు వచ్చే ఎన్నికల్లో ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని అన్నారు. చంద్రబాబు నాయకత్వం కోసం ప్రజలు ఎదురు చూస్తున్నారన్నారు. కార్యక్రమంలో బీసీ సంఘం నాయకులు రామతీర్థం, పీరయ్య, సుబ్బరాయుడు, సిద్ధప్ప, వాసు, లాలయ్య, చిన్నికృష్ణ పాల్గొన్నారు.

'మోసాలకు పాల్పడితే చర్యలు'


కిరాణా దుకాణంలో తనిఖీ చేస్తున్న ఖాజా హుస్సేన్

సంజామల, ఫిబ్రవరి 25: తూనికలు- కొలతలలో మోసాలకు పాల్పడితే చర్యలు తప్పవని లీగల్ మెట్రాలజి డోన్ ఇన్‌స్పెక్టర్ ఖాజా హుస్సేన్ హెచ్చరించారు ఆదివారం మండలంలోని పలు గ్రామాలలో ఆయన తనిఖీలు నిర్వహించారు. కిరాణా వ్యాపారులు నిత్యావసర సరుకులపై ఎంఆర్‌పీ కంటే ఎక్కువకు విక్రయిస్తే కేసులు నమోదు చేస్తామన్నారు. కొందరు దుకాణాదారులు ప్రజలకు కారం, కాఫీ,టీ పొడిలపై ఎంఆర్‌పీ కంటే ఎక్కువ ధరలకు విక్రయించడంతో వారికి జరిమానా విధించారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ ఎస్ ఆర్ హనుమంత్ నాయక్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

టెక్నికల్ ఆఫీసర్ల అసోసియేషన్ జాయింట్ సెక్రటరీగా డోన్ ఆర్టీవో

డోన్(రూరల్), ఫిబ్రవరి 25: విజయవాడలో ఆదివారం జరిగిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రవాణా శాఖ టెక్నికల్ ఆఫీసర్స్ అసోసియేషన్ జనరల్ బాడీ ఎన్నికల్లో డోన్ ఆర్టీవో క్రాంతి కుమార్ అసోసియేషన్ జాయింట్ సెక్రటరీగా ఎన్నికయ్యారు. డోన్ ఆర్టీవో కార్యాలయ సిబ్బంది ఆయనకు అభినందనలు తెలిపారు.